ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
www.andhrajyothy.com



20

కామారెడ్డి

గురువారం 31 ఆగస్టు 2017

కొయ్యగుట్ట తండాలో తాగునీటి కటకట

8 లో..



- మూడు రోజులుగా తాగునీరు లేక నానా ఇబ్బందులు
- వ్యవసాయ బోరుబావుల నీరే గతంటున్న తండావాసులు
- ట్యాంకులు ఉన్నా.. బోరు మోటార్లు సున్నా..
- పైపులైన్ పగలడంతో తాగునీరు సరఫరా కాని వైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- 'ఆంధ్రజ్యోతి'తో గోడు వెల్లబోసుకున్న తండావాసులు

బాన్సువాడ మండలంలోని బోర్లం, తాడ్కోల్ పంచాయతీ పరిధిలోని కొయ్యగుట్ట తండాలో మూడు రోజులుగా తాగు నీరు లేకపోవడంతో వ్యవసాయ బోరుబావుల నుంచి తెచ్చుకుంటున్నా మని తండావాసులు 'ఆంధ్రజ్యోతి'తో గోడు వెల్లబోసుకున్నారు.

8

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో..

మధ్యాహ్న భోజనం మిథ్యేనా?



ఇంటి నుంచి టిఫిన్ బాక్సులు తెచ్చుకొని తింటున్న విద్యార్థినులు (ఫైల్)

రాష్ట్ర ప్రభుత్వం సర్కారు పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కూడా అమలు చేస్తామని ప్రకటించింది. కళాశాలల్లో విద్యార్థుల సంఖ్యను మెరుగుపర్చేందుకు ఈ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. కానీ విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు పూర్తవుతున్నా.. ఈ పథకం అమలుకు నోచుకోవడం లేదు. ఎంతో ఆశతో కళాశాలల్లో చేరిన విద్యార్థులకు నిరాశే మిగిలింది. గ్రామాలు, మండల కేంద్రాల్లో నుంచి వస్తున్న విద్యార్థులు పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.



- ఇంటర్‌లో అమలు కాని మధ్యాహ్న భోజన పథకం
- ప్రభుత్వం ప్రకటించి సంవత్సరం అవుతున్నా.. అడ్రస్ లేని పథకం
- ఇంటర్‌లో పథకాన్ని అమలు చేయలేకపోతున్న ప్రభుత్వం
- జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు
- విద్యను అభ్యసిస్తున్న 15వేల మంది విద్యార్థులు
- కళాశాలలో పస్తులుంటున్న విద్యార్థులు
- ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



భోజనం కోసం పాఠశాలలో వరుస కట్టిన విద్యార్థులు

సామూహిక సెలవుకే.. సై

వివరాలు 2లో..

- పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్
- ఇప్పటికే జిల్లాలో 90 శాతం మంది సెలవు పెట్టిన ఉపాధ్యాయులు





పొంగిపొర్లుతున్న పోచారం ప్రాజెక్టు

20

జలాశయాల్లో.. జలకళ

- నిజాంసాగర్‌లోకి 2,316 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- పొంగిపొర్లుతున్న పోచారం ప్రాజెక్టు
- స్వల్పంగా పెరిగిన కౌలాస్‌నాలా నీటి మట్టం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

మిషన్ భగీరథ పనులు త్వరితగతిన పూర్తి

● రాకేష్, మిషన్ భగీరథ డీఈ



తెలంగాణ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడానికి ఇంటింటికి తాగు నీరు అందించే ప్రతిష్ఠాత్మక కార్యక్రమమైన మిషన్ భగీరథ పనులను త్వరితగతిన పూర్తి చేసి నిర్ణీత సమయంలోగా ప్రజలకు తాగు నీరందించడానికి ప్రయత్నం కొనసాగిస్తున్నామని మిషన్ భగీరథ డిప్యూటీ ఈఈ రాకేష్ 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి: మల్లన్న గుట్ట వద్ద ఏర్పాటు చేసిన వాటర్ గ్రిడ్ ప్లాంట్ల ద్వారా ఎన్ని హ్యాబిటేషన్‌లకు తాగు నీరు లభిస్తుంది?

డీఈ: మల్లన్న గుట్ట వద్ద ఏర్పాటు చేసిన నీటి శుద్ధికరణ ప్లాంట్ల ద్వారా నిజామాబాద్ జిల్లాలో 309 గ్రామాలకు తాగు నీరు అందుతోంది.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో మిషన్ భగీరథ పథకం ద్వారా ఏఏ మండలంలో ఎన్ని గ్రామాలకు తాగు నీరు అందుతుంది?

డీఈ: సదాశివనగర్, రామారెడ్డి ఉమ్మడి మండలంలో 35, మాచారెడ్డి మండలంలోని 64 గ్రామాలకు, కామారెడ్డి మండలంలోని 30 గ్రామాలకు, తాడ్వాయి మండలంలోని 48 గ్రామాలకు, గాంధారి మండలంలోని 86, భిక్కనూరు మండలంలోని 25, దోమకొండ మండలంలోని 21 హ్యాబీటేషన్‌లకు నీరు లభిస్తోంది.

ఆంధ్రజ్యోతి: నేటి వరకు ఎన్ని గ్రామాలకు నీరు అందజేస్తున్నారు?

డీఈ: ప్రస్తుతం 27 గ్రామాలకు తాగునీరు అందజేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: మల్లన్న గుట్ట వద్ద ఏర్పాటు చేసిన ప్యూరీఫైడ్ ప్లాంట్ల నీటి సామర్థ్యం ఏవిధంగా ఉంది.?

డీఈ: మల్లన్న గుట్ట వద్ద ఏర్పాటు చేసిన పాత ప్లాంటు ఒక రోజుకు 30 మిలియన్ లీటర్లు కాగా నూతనంగా ఏర్పాటు చేస్తున్న ప్లాంటు రోజుకు 40 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో నిర్మాణం జరుగుతుంది.

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి నీరు అన్ని గ్రామాలకు అందించగలుగుతారా?

డీఈ: మైల్ స్టోన్ 1 కింద సెప్టెంబర్ 28వ తేదీ వరకు 131 హ్యాబిటేషన్‌లకు నీరు అందించాలన్నా లక్ష్యం కలదు. దాన్ని తప్పకుండా పూర్తి చేస్తాం. మైల్ స్టోన్ 2 లో 2017 డిసెంబర్ నాటికల్లా అన్ని గ్రామాలకు తాగునీరందించడానికి ప్రణాళికలతో ముందుకెళ్తున్నాం.

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో తాగునీటి పథకం కోసం ఎన్ని నూతన ట్యాంకులను నిర్మించడం జరుగుతుంది?

డీఈ: మొదటి మైల్ స్టోన్‌లో 94 ట్యాంకులు నిర్మాణం కోసం ఏర్పాట్లు కాగా ఇప్పటివరకు 45 ట్యాంకులను పూర్తి చేయడం జరిగింది.

-సదాశివనగర్ రూరల్

బర్నింగ్ ఇష్యూ



సీపీఎస్ రద్దు కోసం ఆందోళనలు నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

ఉధృతమవుతున్న సీపీఎస్ ఉద్యమం

● సామూహిక సెలవులకు సిద్ధమైన ఉపాధ్యాయులు, ఉద్యోగులు ● కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేయాల్సిందేనంటున్న ఉద్యోగులు

కామారెడ్డి/ఎల్లారెడ్డి టౌన్: పెన్షన్ పొందడం ఉద్యోగుల హక్కంటూ... కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం గొడ్డలిపెట్టులా ఉందంటూ... కంట్రీబ్యూటరీ పెన్షన్ పథకం (సీపీఎస్) విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎస్ వివిధ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు చేస్తున్న ఆందోళనలు రోజు రోజుకు ఉధృతమవుతున్నాయి. వీరి ఆందోళనలకు పలు శాఖల ఉద్యోగులు కూడా మద్దతు ప్రకటిస్తున్నారు. ప్రభుత్వంతో తాడోపేడో తెల్చుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాలు, ఉద్యోగ సంఘాలు పిలుపునిచ్చారు. జిల్లాలో డివిజన్, మండలాల స్థాయిలో ప్రత్యేక కమిటీలు(సీపీఎస్) వేసుకుని తమ నిరసనలు తెలుపుతున్నారు. జిల్లాలో 1200లకు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 4వేలకు పైగా ఉపాధ్యాయులు, వివిధ శాఖల ఉద్యోగులు మరో 3వేలకు పైగా జిల్లాలో సెలవులు పెట్టి సెప్టెంబర్ ఒకటిన జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ చర్చి కంపౌండ్‌లో జరిగే ఆందోళన కార్యాక్రమంలో పాల్గొననున్నారు. ఉపాధ్యాయ సంఘాలు వివిధ రూపాల్లో పాఠశాలల వద్ద నిరసనలు తెలుపుతున్నారు. వివిధ శాఖల సీపీఎస్ అంతం మా పంతం అంటూ ముందుకు సాగుతున్నారు. వీరి ఆందోళనలకు అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు మద్దతును ప్రకటించాయి.

సీపీఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తున్న ఉద్యోగులు..

ఉద్యోగ విరమణ అనంతరం పెన్షన్ పొందడం ఉద్యోగి హక్కని ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఉద్యోగి తను ఉద్యోగంలో చేరినప్పటి నుంచి తన పదవీకాలం ముగిసే సమయానికి వృద్ధాప్యానికి చేరువలకు వచ్చే ఉద్యోగులు ఈ సమయంలో దాదాపు 3దశాబ్దాలపాటు విధులు నిర్వహించి పదవీ విరమణ పొందుతారని అన్నారు. పదవీవిరమణ పొందిన ఉద్యోగులకు వారి కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించడం ప్రభుత్వం కనీస ధర్మమని, కానీ ప్రభుత్వం ఆ బాధ్యత నుంచి తప్పుకుంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి వెంటనే పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఉద్యోగస్తులు డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంపాయిూస్ అసోసియేషన్ (టీసీపీఎస్ఈఏ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోరుబాటను ఉధృతం చేసిందని అన్నారు. ఇందులో భాగంగానే తాము చేసే ఉద్యమంతో తమకు, తమ కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ నిర్ణయంతో సీ పీఎస్ వర్తించే ఉపాధ్యాయులు, ఇతర శాఖల ఉద్యో గులకు సీపీఎస్ పథకం గొడ్డలిపెట్టులా ఉందని, సీపీఎస్ ను రద్దు చెయాలని డిమాండ్ చేస్తున్నారు. సెప్టెంబర్ 1న ఒకే సారి వేలాది మంది ఉద్యోగులు సెలవు పెడుతుండడంతో పరిపాలన స్తంభించనుంది

పాత పింఛన్ విధానంతో లాభాలు..

2004 ముందు నియమితులైన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పింఛన్ విధానం అమలు చేయడం జరుగుతుంది. ప్రభుత్వ ఉద్యోగులు ఎలాంటి వాటా చెల్లించకుండానే వారు విరమణ అయ్యే సమయంలో వారి చివరి వేతనం బేసిక్‌పేలో 50శాతం పింఛన్‌గా, మిగతా 50శాతం ఇతర అలవెన్సులు కలిపి చెల్లిస్తారు. ప్రభుత్వం పెరిగిన ధరలనుకూలంగా ప్రతీ 5ఏళ్లకొకసారి (పీఆర్‌సీ)వేతన సవరణ సంఘం ద్వారా ఉద్యోగులకు పింఛన్‌ను అందిస్తారు.

కొత్త పథకం ఎవరికీ లాభం..?

నూతన పింఛన్ విధానంతో ఉద్యోగులు, అసంఘటిత కార్మికులకు లాభం అన్నది అప్పటికి ప్రభుత్వాల వాదన. ఇది నిజం కాదని ప్రభుత్వ ఉద్యోగుల వాదన..పాత పింఛన్ విధానం కన్న మెరుగైన పింఛన్ విధానం తీసుకొస్తామని, అసంఘటిత కార్మికులకు విస్తరిస్తామని చెప్పిన పాలకులు ప్రస్తుతం ఉద్యోగులకు ఉన్న ఆర్థిక భద్రత దూరం చేసి సామాజిక భద్రతపై ఆందోళనను రేకేత్తించారన్న విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.



సీపీఎస్ విధానం ఉద్యోగుల శ్రమదోపిడీ..

సీపీఎస్ విధానంతో ఉద్యోగులు శ్రమదోపిడీకి గురవుతున్నారు. పదవీ విరమణ చేసిన అనంతరం వృద్ధ్యాపంలో సీపీఎస్ విధానంతో భరోసా ఉండదు. పెన్షన్ విధానంతో వృద్యాపంలో ఉద్యోగికి భద్రత అనేది ఉంటుంది. సీపీఎస్ విధానం రద్దు చేయాల్సిందే. లేకుంటే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తాం. సెప్టెంబర్ 1న ముకుమ్మడిగా ఉపాధ్యాయులు సెలవు పెట్టి నిరసన వ్యక్తం చేస్తున్నాం.

- దామోదర్‌రెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు, కామారెడ్డి



సెప్టెంబర్ 1 ధర్నాను విజయవంతం చేయాలి..

సెప్టెంబర్ 1న జిల్లా కేంద్రంలో నిర్వహించే ఆందోళన కార్యక్రమానికి అన్ని మండలాలకు చెందిన సీపీఎస్ వర్తించే ఉపాధ్యాయులు, ఉద్యోగులు తరలివచ్చి విజయవంతం చేయాలి. నూతన సీపీఎస్‌ను రద్దుచేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలి. ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొస్తాం.

-నాగరాజు, టీఎస్‌పీఎస్ఈఏ అధ్యక్షుడు ఎల్లారెడ్డి డివిజన్

నాళేశ్వర్‌లో పెద్దరాజరాజేశ్వరస్వామి.. వేములవాడలో చిన్నరాజరాజేశ్వరస్వామి..

ఆధ్యాత్మికం



నాళేశ్వర్‌లోని రాజరాజేశ్వరస్వామి ఆలయం

నవీపేట మండలంలోని నాళేశ్వర్‌లోని చారిత్రక దేవాలయం లో కొలువైన రాజరాజేశ్వరస్వామిని భక్తితో కొలిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. ఈ ఆలయం 11వ శతాబ్దంలో వెలసిందని పూర్వీకులు పేర్కొంటున్నారు. నాళేశ్వర్‌లో పెద్ద రాజరాజేశ్వరస్వామి, వేములవాడలో చిన్నరాజరాజేశ్వర స్వామి ఆలయాలు ఒ కేసారి వెలిశాయని ఇక్కడి భక్తుల విశ్వాసం. ప్రతీ సంవత్స రం శివరాత్రి రోజున జరిగే జాతరకు నిజామాబా ద్, కామారెడ్డి జిల్లాలతోపాటు పొరుగునున్న మహారాష్ట్ర నుంచి కూడా పెద్దఎత్తు న భక్తులు హాజరవుతారు. శివరాత్రి రోజున రాజరాజేశ్వరస్వామికి కోడెదూడలను కట్టి మొక్కులు చెల్లించుకోవడం ఇక్కడి ప్రత్యేకత. నాళేశ్వర్ గోదావరి సమీపంలో కొలువైన రాజరాజేశ్వరస్వామికి నిత్యపూజలతో పాటు ప్రతీ సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటున్నారు. నాళేశ్వర్‌లో సుమారు ఐదువేల వరకు జనాభా ఉండగా, వీరిలో సుమారు ఐదొందలమందికి పైగా రాజేశ్వర్ పేరుండటం విశేషం. - నవీపేట

టీచర్ వాయిస్

ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంల సమస్యలను పరిష్కరించాలి

● రాజేందర్ గౌడ్, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి



ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి. అర్హత కలిగిన హెచ్ఎంలకు గెజిటెడ్ హోదా కల్పించాలి. వేసవి సెవుల్లోనూ మధ్యాహ్నం భోజనం విధులు నిర్వహిస్తున్నందున వారికి సంపాదిత సెలవు మంజూరుచేయాలి. ఉపాధ్యాయులకు వేసవిలోగా పదోన్నతులు కల్పించాలి. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలి.

-ఆర్మూర్

పత్తి దిగుబడులపై రైతన్నల ఆశలు!

మద్నూర్: మండలంలో వారం రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుడడంతో రైతుల్లో పత్తి పంట దిగుబడులపై ఆశలు పెరిగాయి. మండలంలో ఇటీవల కురిసిన వర్షాల వల్ల చేతికొచ్చిన పెసర, మినుము, పంటలు కొంత మేరకు నష్టపోయినప్పటికీ వారం చివర్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో రైతులు తమ పెసర, మినుము పంటను కోసుకున్నారు. పెసర, మినుము పంటలు నష్టపోయినప్పటికీ విస్తారంగా కురిసిన వర్షాలతో పత్తి పంటలోనైనా దిగుబడి సాధించుకుంటామని రైతులు ఆశిస్తున్నారు. మండలంలో ఈ వారం రోజుల్లో అత్యధికంగా 50.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చెరువులు, కుంటలు నిండుకున్నాయి. పత్తిపంటకు ఈ వర్షం జీవం పోశాయని రైతులు తెలిపారు. మండలంలో గత ఏడాది పత్తిపంట సాగుకు రైతులు మక్కువ చూపకపోవడం ఈ సారి మండలంలో 4836 ఎకరాలలో పత్తి సాగు చేశారు. పత్తి చేలు ప్రస్తుతం పూత దశలో ఉండడంతో రైతుల పంటను చూసి హర్షం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు తగు సలహాలు, సూచనలు ఇచ్చి అధిక దిగుబడి వచ్చే విధంగా చూడాలని రైతులు కోరుతున్నారు.



మద్నూర్‌లో రైతులు సాగు చేస్తున్న పత్తి పంట

విద్యుదాఘాతంతో రైతు మృతి



సింగరాయిపల్లిలో విద్యుదాఘాతంతో మృతిచెందిన తోట కిష్టయ్య

రామారెడ్డి: మండలంలోని సింగరాయిపల్లిలో ఓ రైతు విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సింగరాయిపల్లి గ్రామానికి చెందిన తోట కిష్టయ్య (55) గత రాత్రి పొలానికి నీళ్లు పెట్టడానికి వెళ్లాడు. బోరు మోటారు ఆన్ చేయడానికి స్టాటర్ డబ్బాను తాకగానే విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కిష్టయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నట్లు వారు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కిష్టయ్యకు భార్య అంజవ్వ, దత్తపుత్రిక శారద ఉన్నారు.

నాగిరెడ్డిపేట్‌లో..



కాలువలో పడి మృతి చెందిన గంప సాయిలు

నాగిరెడ్డిపేట్: మండలంలోని చినూర్ గ్రామానికి చెందిన రైతు గంపల సాయిలు (32) మాల్‌తుమ్మెద గ్రామ శివారులో బుధవారం తన పొలం వద్ద ప్రమాదవశాత్తుపంట కాలువలో పడి మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ నర్సయ్య తెలిపారు. నర్సయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లింగంపేట మండలం సజ్జనపల్లి గ్రామానికి చెందిన సాయిలు పది సంవత్సరాల క్రితం చినూరి గ్రామానికి ఇల్లరికం వచ్చాడు. బుధవారం ఉదయం తన పొలానికి వెళ్లాడన్నారు. పొలం వద్ద గెట్టుపై నుంచి నడుస్తు వెళ్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి పంట కాలువలో పడినట్లు, సాయిలు సొమ్మ వ్యాధి ఉండడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. సాయిలుకు భార్య ఈరవ్వ, పిల్లలు అరవింద్ (5), పల్లవి (3), గట్టవ్వ (1) ఉన్నారు. సంఘటన స్థలాన్ని తహసీల్దార్ మంత్రునాయక్ సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు హెడ్‌కానిస్టేబుల్ నర్సయ్య తెలిపారు.

స్వగ్రామానికి చేరిన యువకుడి మృతదేహం

● కన్నీటి పర్యంతమైన వెల్లుట్ల వాసులు

ఎల్లారెడ్డి టౌన్: బతుకుదెరువుకోసం సౌదీ అరేబియాకు వెళ్లిన ఓ యువకుడు గత నెల ఉరివేసుకోని ఆత్మహత్యకు పాల్పడగా అతడి మృతదేహాన్ని నెలరోజుల తరువాత బుధవారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్ల గ్రామానికి చెందిన నర్వ అశోక్ (24) 15 నెలల క్రితం బతుకుదెరువు కోసం సౌదీ అరేబియాకు వెళ్లాడు. గత జులై 31న అశోక్ తాను పనిచేసే ప్రాంతంలో ఉరివేసుకోని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. నెలరోజుల క్రితం సౌదీలో మృతిచెందిన అశోక్ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకొచ్చేందుకు ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి, మిషన్ భగీరథ చైర్మన్, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డిలు చొరవ తీసుకున్నట్లు ఎంపీపీ నక్కగంగాధర్, కుటుంబ సభ్యులు తెలిపారు. అశోక్ అంత్యక్రియల్లో గ్రామస్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



ఆత్మహత్యకు పాల్పడిన అశోక్ (ఫైల్)



అశోక్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

దోమకొండలో కారు ప్రమాదంతో కరెంట్ కోత



ప్రమాదానికి గురైన కారు

దోమకొండ: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ సేష్టన్ పరిధిలో మంగళవారం మాచారెడ్డి మండలంలోని ఫరీద్‌పేట్ గ్రామానికి చెందిన ఏపీ15ఏక్యూ8104 ఇండికా విస్టా వాహనం అదుపు తప్పి కరెంట్ స్తంభాన్ని ఢీ కొట్టింది. దీంతో కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలు కాగా విద్యుత్ స్తంభం కారుకు ఒక్క పక్కకు ఒరిగింది. దీంతో బుధవారం సాయంత్రం కారును తొలగించి నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు. ప్రమాదం వల్ల గ్రామంలో సుమారు రెండున్నర గంటల పాటు విద్యుత్ అంతరాయం కలిగింది.

●●● ప్రాజెక్టుల సమాచారం ●●●

	గరిష్ఠ మట్టం (అడుగుల్లో)	ప్రస్తుత మట్టం (అడుగుల్లో)	గరిష్ఠ నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	నీటి చేరిక (క్యూసెక్కుల్లో)	విడుదల (క్యూసెక్కుల్లో)
శ్రీరాంసాగర్	1,091.90	1,072.60	90.31	34.401	38,864	50
నిజాంసాగర్	1,405.00	1,386.50	17.802	2.797	2,316	424

బంగారం ధరలు



బిస్కెట్ బంగారం	10 గ్రాములకు	రూ. 30,900
ఆర్నమెంట్ బంగారం	10 గ్రాములకు	రూ.30,500
వెండి 10 గ్రాములకు	రూ. 435	

సినిమా గైడ్ కామారెడ్డి



ప్రియా70 ఎంఎం	..	అర్జున్‌రెడ్డి
ప్రియా 35 ఎంఎం	..	ఫిదా
శాంతి	..	వివేకం
దర్శన్	..	జయ జానకి నాయక

చికిత్సపొందుతూ బాలిక మృతి

నిజాంసాగర్: చదువులో ముందుండాలని తల్లిదండ్రులు సూచించడంతో తీవ్ర మనస్థాపం చెంది 12సంవత్సరాల బాలిక కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న బాలికను హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అచ్చంపేట గ్రామానికి చెందిన శ్రీశైలం, సంగీత దంపతుల కుమార్తె శాలిని మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లిదం డ్రుల ఫిర్యాదు మేరకు నిజాంసాగర్ పో లీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ గాంధీగౌడ్ తెలిపారు. శాలిని మృతి పట్ల స్థానిక బ్లూబెల్స్ పాఠశాల విద్యార్థులు సానుభూతి వ్యక్తం చేశారు.

ఎల్పుగొండలో పోలీసుల పల్లె నిద్ర

మాచారెడ్డి: మండలంలోని ఎల్పుగొండ గ్రామంలో మంగళవారం రాత్రి ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు గ్రామ స్థలతో కలిసి పల్లె నిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను, బక్రీద్ పర్వదినాన్ని ప్రశాంతంగా మతాలకు అతీతంగా నిర్వహించుకోవాలన్నారు. అలాగే గణేష్ నిమజ్జనం చేసేటప్పుడు అందరూ వరుస క్రమంలో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించి గ్రామాల సమీపంలోని చెరువుల్లో నిమజ్జనం చేసుకోవాలన్నారు.

ఇంటర్వ్యూ

డాక్యుమెంటేషన్ ఉంటేనే ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు



సయ్యద్ మగ్దుమ్‌అష్రఫ్, పంచాయతీ కార్యదర్శి, రెడ్డిపేట్

ఆంధ్రజ్యోతి: మీ పరిధిలోని గ్రామాల్లో నూతన ఇళ్ల నిర్మాణం కోసం అనుమతులు ఇస్తున్నారా?

కార్యదర్శి: సరైన డాక్యుమెంటేషన్, స్థలం దస్తావేజులు, ఇంజనీరింగ్ ప్లాన్ ఉన్న వాటికి ఇళ్ల నిర్మాణానికి అనుమతులను ఇస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మీ పరిధిలోని గ్రామాల్లో ఎంత శాతం ఇంటి పన్నులు వసూల య్యాయి?

కార్యదర్శి: రెడ్డిపేట్‌లో వంద శాతం, సింగరాయిపల్లిలో 63 శాతం, లక్ష్మీరావులపల్లిలో 68 శాతం ఇంటి పన్నులు వసూలయ్యాయి.

ఆంధ్రజ్యోతి: వ్యక్తిగత మరుగు దొడ్ల నిర్మాణాలు ఎంత వరకు వచ్చాయి?

కార్యదర్శి: సింగరాయిపల్లిలో 35 వ్యక్తిగత మరుగుదొడ్ల పనులు కొనసాగుతున్నాయి. రెడ్డిపేట్‌లో 120 వ్యక్తిగత మరుగు దొడ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. వీటిని త్వరలో పూర్తి చేస్తాం.

ఆంధ్రజ్యోతి: 14వ ఆర్థిక నిధులు మంజూరయ్యాయా?

కార్యదర్శి: రెడ్డిపేటకు రూ.14,18,759లు, సింగరాయిపల్లికి రూ.2,49,211లు, లక్ష్మీరావులపల్లికి రూ.2,16,038లు 14వ ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయి.

- మాచారెడ్డి

సమస్యల వలయంలో మాచారెడ్డి బస్టాండ్

● పగిలిన కిటికీ అద్దాలు ● వృథాగా మారిన షెటర్లు ● ఇబ్బందుల్లో ప్రయాణికులు ● పట్టించుకోని అధికారులు

మాచారెడ్డి: మండల కేంద్రం ఎదురుగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్ సమస్యల వలయంతో కొట్టుమిట్టాడుతోంది. లక్షలు వెచ్చించి నిర్మించిన బస్టాండ్ అలంకారప్రాయంగా మారింది. కరీంనగర్, సిరిసిల్లా, సిద్దిపేట, కామారెడ్డి పట్టణాలను కలిపే రాష్ట్ర రహదారి పక్కనే బస్టాండ్ ఉంది. బస్టాండ్‌లో ప్రయాణికులకు మలవిసర్జనలు చేయడానికి, తాగేందుకు మంచి నీరు అందుబాటులో లేవు. షెటర్లను అద్దెకు ఇచ్చి దుకాణాలను నడపాల్సింది పోయి మూత పడిపోయాయి. దీంతో ఆర్టీసీ ఆదాయానికి గండి పడింది. అలాగే ప్రయాణికుల కోసం నిర్మించిన మరుగు దొడ్లు పిచ్చి మొక్కలతో నిండిపోయి వృథాగా మారాయి. బస్టాండ్ ఆవరణలో గుంతలు ఏర్పడడంతో ఆ గుంతల్లో వర్షపు నీరు నిలిచి ఆవరణమంతా మురికిగా మారింది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



వృథాగా ఉన్న బస్టాండ్ షెటర్లు

కొనసాగుతున్న జిల్లాస్థాయి ఇంటర్ క్రీడా పోటీలు





జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో తలపడుతున్న జట్లు

కామారెడ్డి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన వాలీబాల్ పోటీల్లో బాలికల విభాగంలో బాన్సువాడ, బాలుర విభాగంలో కామారెడ్డి వశిష్ట జూనియర్ కళాశాల జట్లు గెలుపొందాయి. బుధవారం కబడ్డీ పోటీలు జరిగాయి. కబడ్డీ పోటీలకు 57బాలురు, 44బాలికల జట్లు పోటీ పడ్డాయి. ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తరువాత జిల్లాస్థాయి ఇంటర్ పోటీలు మొదటి సారిగా జరగడంతో క్రీడలకు మంచి స్పందన లభించింది. ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల విద్యార్థులు పోటీల్లో ఆసక్తిగా పాల్గొన్నారు. పోటీలను తిలకించేందుకు జిల్లా నోడల్ అధికారి నాగరాజు, వివిధ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ తరలి వచ్చారు. గురువారం ఖోఖో పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లాక్రీడల కార్యదర్శి గంగాధర్, అధ్యక్షుడు ప్రిన్సిపాల్ శేఖ్‌సలామ్‌లు తెలిపారు. గురువారం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ చేతుల మీదుగా బహుమతులను పంపిణీ చేయనున్నట్లు వారు తెలిపారు.

ప్రారంభమైన వినాయక విగ్రహాల నిమజ్జనాలు

కామారెడ్డి కల్చరల్ : జిల్లా కేంద్రంలో గణేష్ నిమజ్జనోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను బుధవారం ఘనంగా నిమజ్జనం చేశారు. పట్టణంలోని పలు ప్రైవేట్ కళాశాలలు సాందీపని, ఆర్కే, మంజీరా, ప్రజ్ఞ, ఎస్ఆర్‌కే, వశిష్ట డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో ప్రతిష్ఠించిన గణపయ్య విగ్రహాలను విద్యార్థులు ఆటాపాటలతో ఘనంగా సాగనంపారు.

దోమకొండలో..

దోమకొండ: మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం గణేష్ నిమజ్జనోత్సవాలు ఘనంగా జరిగాయి. దోమకొండ, బీబీపేట్ మండలాల్లోని గ్రామాల్లో గణనాథుల నిమజ్జనోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలలో గణనాథులను ఉంచి గ్రామాల్లోని ప్రధాన వీధుల గుండా శోభా యాత్ర నిర్వహించారు. వాహనాల ముందు ఉప్పు చప్పుల మధ్య యువకులు, విద్యార్థులు నృత్యాలు చేస్తూ పాటలు పాడారు. వీధుల్లో మహిళలు వినాయకులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎల్లారెడ్డిల్లో..

ఎల్లారెడ్డి టౌన్: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఉదయం వినాయకుల ప్రతిమలను నిమజ్జనం చేశారు. మండలంలోని దవల్‌మాల్కపల్లి, సాతెల్లి, సబ్దల్‌పూర్ తదితర గ్రామాలలో యువకులు, గ్రామస్థులు ఆనందోత్సవాల మధ్య నృత్యాలు చేస్తూ విగ్రహాలను మంగళవారం రాత్రి ఊరేగింపుగా తీసుకువెళ్లి ఉదయం ఎల్లారెడ్డి పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు.

మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పలు గణేష్ మండపాల వద్ద బుధవారం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో గల యువజన సమాఖ్య గణేష్ మండపం వద్ద ఫారెస్ట్ ఆఫీసర్ కుమార్‌గౌడ్ ప్రత్యేక పూజలు జరిపి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే సిరిసిల్లా రోడ్‌లోని నోబుల్ యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పద్మశాలి సంఘం మండపం వద్ద కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారీ ఎత్తున మహిళలు హాజరయ్యారు.

మండలంలో..

కామారెడ్డి రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం గణేష్ మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అడ్లూర్‌లో చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో సర్పంచ్ రాములు, మండల కో-ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ హఫీజ్ తదితరులు పాల్గొన్నారు. దేవునిపల్లిలో నెహ్రూ యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఉగ్రొండ నర్సింలు, నిట్టు శంకర్‌రావు, ద్వారి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయిలో పూజలు

తాడ్వాయి: మండల కేంద్రంలో బుధవారం ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులు గణనాథునికి పూజలు నిర్వహించారు. తాడ్వాయి మండపాల్లో ప్రతిష్ఠించిన గణనాథులకు మహిళలు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

కాల భైరవస్వామిని దర్శించుకున్న బుల్లితెర నటుడు



నటుడు ప్రభాకర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

రామారెడ్డి: మండలంలోని ఇస్సన్నపల్లి-రామారెడ్డి గ్రామాల మధ్య వెలసిన కాల భైరవ స్వామిని బుధవారం ప్రముఖ టీవీ సీరియల్ నటుడు, యాంకర్ ప్రభాకర్‌లు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చరిత్ర వివరాలను అడిగి తెలుసుకొని ఆలయ అభివృద్ధికి రూ.25వేల చెక్కును ఆలయ కమిటీ చైర్మన్‌కు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌ను ఘనంగా సన్మానించి స్వామి వారి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గంజ్ సతీష్‌గుప్తా, ఆలయ ఈవో రవీందర్, సురేందర్, ప్రధాన అర్చకులు శ్రీనివాస్ శర్మ, రాజేందర్‌గౌడ్, లింబాద్రిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఆహారభద్రతపై అవగాహన

మాచారెడ్డి: మండలంలోని రత్నగిరిపల్లి గ్రామంలో జాతీయ ఆహారభద్రత పథకంపై కామారెడ్డి ఏడీఏ మహేశ్వరి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని రైతులు వేసిన పెసర పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పప్పు ధాన్యాల పంటలపై మొగ్గు చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో లావణ్య, సౌజన్య, రాజేష్, గ్రామ సర్పంచ్ శ్రీరాం, ఉప సర్పంచ్ అంజల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అర్హులైన బీడీ కార్మికులందరికీ ఇళ్లు మంజూరు చేయాలి'

కామారెడ్డి రూరల్ : జిల్లాలో ఇళ్లు లేని బీడీ కార్మికులందరికీ ఇళ్లు మంజూరు చేయాలని నూతన బీడీ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో బీడీ కార్మికులు బుధవారం కామారెడ్డి ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి శివంది సత్యం మాట్లాడుతూ జిల్లాలో 2 లక్షల మంది బీడీ కార్మికులు పని చేస్తున్నారన్నారు. ఇళ్లు లేక చాలా మంది కార్మికులు అద్దె ఇళ్లల్లో నివాసముంటూ బీడీలు చుడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు మంజూరు చేసి వారికి గృహాలను నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ఎస్‌కే హసన్, సంజీవ్, నర్సింలు, రాధ, మణెమ్మ, విజయ, జ్యోతి, బాలమణి, లలిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సెర్ప్ సిబ్బంది వినూత్న నిరసన

కామారెడ్డి రూరల్: మండల సమాఖ్యలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కామారెడ్డి ఆర్డీవో కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మె బుధవారం నాటికి 15వ రోజుకు చేరుకున్నాయి. బుధవారం సెర్ప్ సిబ్బంది మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో మండల సమాఖ్య ప్రభుత్వ పథకాలను అమలు చేస్తూ మండల సమాఖ్య సిబ్బంది సెర్ప్ పరిధిలో లేరని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలి'

కామారెడ్డిటౌన్: జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి ఉద్యోగులు కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి సురేశ్‌బాబు అన్నారు. బుధవారం కామారెడ్డి జిల్లా గ్రంథాలయంలో జిల్లా గ్రంథపాలకులు, నిర్వాహకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా నిజామాబాద్ జిల్లా కార్యదర్శి నర్సింలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథపాలకులు, నిర్వాహకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలి'

నాగిరెడ్డిపేట్: సెప్టెంబరు 17ను తెలంగాణ విమోచన దినాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరుతూ బీజేపీ నాయకులు బుధవారం మండల తహసీల్దార్ మంత్రునాయక్ వినతి పత్రాన్ని అందజేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారికంగా సెప్టెంబరు 17ను నిర్వహిస్తామని చెప్పిన టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రస్తుతం ఆ మాటను మరిచిపోయిందని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు మర్రి బాపురెడ్డి, రాష్ట్ర బీజేవైఎం నాయకులు గుండబాల్‌కిషన్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు రవిగౌడ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ

వందశాతం మరుగుదొడ్ల నిర్మాణాలకు కృషి



నారాయణ, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ, తాడ్వాయి

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో మరుగు దొడ్ల నిర్మాణాలకు కృషి చేస్తున్నారా?

ఈవోఆర్డీ: గ్రామాల్లో మరుగు దొడ్ల నిర్మాణాలకు కృషి చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో పారిశుధ్య లోపం నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఈవోఆర్డీ: గ్రామాల్లో పారిశుధ్య లోప నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవలే స్వచ్ఛ భారత్ కింద ప్రభుత్వం ప్రతీ గ్రామానికి చెత్త రిక్షాలను పంపిణీ చేసింది. ఈ రిక్షాలతో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించి డంప్ యార్డులకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: గ్రామ పంచాయతీలకు పంపిణీ చేసిన రిక్షలు గ్రామ పంచాయతీల ఆవరణలో వృథాగా ఉంటున్నాయి కాదా, దీనిపై ఎలాంటి మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఈవోపీఆర్డీ: గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ఇళ్లలోని చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించడానికి రిక్షాలను పంపిణీ చేసింది. ఈ రిక్షాల్లో చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలి. అన్ని రిక్షాల ను గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు సద్వినియోగం చేసుకోవాలి.

ఆంధ్రజ్యోతి: మండలానికి ఎన్ని రిక్షాలు మంజూరయ్యాయి?

ఈవోపీఆర్డీ: మండలంలోని 23 గ్రామ పంచాయతీలకు జనాభా ప్రాతిపాదికన 60 రిక్షాలు మంజూరయ్యాయి.

ఆంధ్రజ్యోతి: వర్షకాలంలోను గ్రామాల్లో ప్రజలు తాగు నీటి ఇబ్బందులు పడుతున్నారు కదా, దీని పై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఈవోపీఆర్డీ: వర్షకాలంలో కొన్ని గ్రామాల్లో ప్రజలు తాగు నీటి ఇబ్బందులు పడుతున్నారు. ఆ గ్రామాల్లో ప్రత్యామ్నయ చర్యలు చేపట్టాం. తాగు నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది, దీని పై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఈవోపీఆర్డీ: కొన్ని గ్రామాల్లో పారిశుద్యం అధ్వానంగా ఉంది. ఆ గ్రామాల్లో వెంటనే మురికి కాలువలను శుభ్రపర్చాలని కార్యదర్శులను ఆదేశించాం.

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో ఇంటి పన్ను వసూలుకు చర్యలు తీసుకుంటున్నారా?

ఈవోపీఆర్డీ: గ్రామాల్లో ఇంటి పన్నుల వసూళ్ల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వసూళ్ల కోసం గతంలో స్పెషల్ డ్రైవ్ కూడా నిర్వహించాం.

- తాడ్వాయి

లక్షలు వెచ్చించారు.. లక్షణంగా వదిలేశారు!

• ఎర్రాపహాడ్‌లో ఏడేళ్లయినా ప్రారంభానికి నోచుకోని అంగన్‌వాడీ, ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనాలు • పట్టించుకోని అధికారులు





జర దేఖో..

ఎర్రాపహాడ్‌లో వృథాగా ఉన్న భవనాలు ఇవే..

తాడ్వాయి: ప్రభుత్వం అంగన్‌వాడీ భవనాల కోసం లక్షలాది రూపాయలు వెచ్చించిస్తున్నా ప్రయోజనం లేకుండా పోతుంది. చాలా గ్రామాల్లో అంగన్‌వాడీలకు ప్రత్యేక భవనాలు లేకపోవడంతో చాలీ చాలని ఇరుకు గదుల్లో పిల్లలను ఉంచుతూ ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో భవనాలు పూర్తి అయినా ప్రారంభించడం లేదు. మరికొన్ని గ్రామాల్లో భవనాల నిర్మాణాలకు పూర్తి స్థాయిలో నిధులు చాలకపోవడంతో మధ్యలోనే నిర్మాణాలు నిలిచిపోతున్నాయి. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్తున్న చిన్నారులు అవస్థలు పడుతున్నారు. మండలంలోని ఎర్రాపహాడ్ గ్రామంలో ఏడు సంవత్సరాల క్రితం అంగన్‌వాడీ భవనాన్ని, ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనాన్ని అధికారులు నిర్మించారు. కానీ ఇప్పటికీ ఉపయోగంలోకి తీసుకురావడంలో విఫలమయ్యారు. అధికారులు లక్షల రూపాయలు వెచ్చిస్తూ నిర్మిస్తున్న భవనాలను వృథాగా ఉంచుతున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లక్షలాధి రూపాయలు వెచ్చిస్తూ భవనాలు నిర్మించేంత శ్రద్ధ వాటిని ప్రారంభించడంలో చూపించడం లేదు. అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించి వదిలేయడంతో భవనం వృథాగా ఉండి చెత్త చెదారంతో నిండిపోయి యాచకులకు నిలయంగా మారుతోంది. ఎస్సీల కోసం ఏడు సంవత్సరాల క్రితం నిర్మించిన కమ్యూనిటీ హాల్ భవనం కూడా వృథాగా మారింది. రూ. 2.50 లక్షలతో అంగన్‌వాడీ భవనం, రూ.2 లక్షలతో కమ్యూనిటీ హాల్ భవనాన్ని నిర్మించారు. ఈ భవనాలు ఎవరూ ఉపయోగించకపోవడంతో భవనంలోకి పశువుల వచ్చి భవనాలను అపరిశుభ్రంగా మారుస్తున్నాయి. ఇప్పటికైన అధికారులు స్పందించి భవనాలను ఉపయోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

తాడ్వాయిలో ఘనంగా బలరామ జయంతి



తాడ్వాయిలో బలరాముడికి నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడ్వాయి: మండల కేంద్రంలో బుధవారం భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో బలరామ జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు జెండాను ఆవిష్కరించి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు అంబీర్ బాల్ కిషన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో విఫలమవుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో తాడ్వాయి సింగిల్ విండో చైర్మన్ దేమాగు సంజీవరెడ్డి, నాయకులు విఠల్‌రెడ్డి, సుగుణాకర్‌రెడ్డి, రాఘవరెడ్డి, వెంకట్‌రావు, శంకర్, మైపాల్‌రెడ్డి, సదాశివుడు పాల్గొన్నారు.

'సాక్షర భారత్ కో-ఆర్డినేటర్ల వేతనాలు పెంచాలి'

తాడ్వాయి: తమ వేతనాలు పెంచాలని కొరుతూ మండలంలోని సాక్షర భారత్ కో-ఆర్డినేటర్లు సమ్మె ప్రారంభించి తమ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సాక్షర భారత్ మండల కో-ఆర్డినేటర్ బక్క గణేష్, వివిధ గ్రామాల కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సాక్షర భారత్ కో-ఆర్డినేటర్లు

'మహిళా సమాఖ్యలు మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలి'

సదాశివనగర్ రూరల్: మహిళ సమాఖ్య కార్యవర్గం గ్రామాల్లోని మహిళా సంఘాల ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలని డీఎంజీ రాంచంద్రాగౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో నూతన కార్యవర్గం ఏర్పాటు సందర్భంగా మహిళా సంఘాల అధ్యక్షురాళ్లను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద మహిళలకు మహిళా సంఘాల ద్వారా ఆర్థిక చేయూతను అందించి వారి అభివృద్ధిని పర్యవేక్షించాలన్నారు. పుస్తక నిర్వహణ , రుణ చెల్లింపులు, పొదుపులు, బీమా ఈ కార్యక్రమంలో ఏపీఎం సాయిలు, సీసీలు ప్రవీణ్‌కుమార్, ఆంజనేయులు, దుర్గదాస్ తదితరులు పాల్గొన్నారు.

'నాణ్యమైన ఎరువులను అందించాలి'

సదాశివనగర్ రూరల్: రైతులకు నాణ్యమైన పురుగు మందులను అందించి రైతుల అభివృద్ధికి తోడ్పడాలని మండల వ్యవసాయాధికారి నదీమ్ ఉద్దిన్ ఫెస్టిసైడ్ అమ్మకందారులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని జగదీశ్వర ఫెస్టిసైడ్, వెంకటేశ్వర ఫెస్టిసైడ్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుగు మందుల దుకాణంలో నాణ్యత లేని, గడువు మీరిన పురుగు మందులను విక్రయించి రైతులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌లు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు పాద పూజ

తాడ్వాయి: మండలంలోని కృష్ణాజివాడి రాజరాజేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో స్థానిక సరస్వతి శిశు మందిర్ ఆధ్వర్యంలో మైవిలేజ్, మోడల్ విలేజ్ ఫౌండేషన్ సమక్షంలో తల్లిదండ్రులకు బుధవారం కుమారులు, కుమార్తెలు పాద పూజ నిర్వహించారు. తల్లిదండ్రుల కాళ్లను నీళ్లతో కడిగి పాలతో శుద్ధి చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సరస్వతి శిశు మందిర్ ప్రధానోపాధ్యాయుడు రవీందర్, ఉపాధ్యాయులు రాజు, సదానందం, మైవిలేజ్, మోడల్ విలేజ్ పౌండేషన్ ప్రతినిధి బాల్‌రాజుగౌడ్, గ్రామపెద్దలు విజయరావు, గోపి, బాల్‌కిషన్ తదితరులు పాల్గొన్నారు.

వాడి వేడిగా గాంధారి మండల సభ



గాంధారి సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న వైద్యుడు

గాంధారి: సమస్యలు పరిష్కారం కాకుంటే మూడు నెలలకోసారి సర్వసభ్య సమావేశం ఎందుకు నిర్వహిస్తున్నారని గాంధారి మండల సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల పరిషత్ సమావేశాన్ని ఎంపీపీ యశోదబాయిశివాజీరావు అధ్యక్షతన నిర్వహించారు. సభ ప్రారంభం కాగానే వ్యవసాయ అధికారి పంటల సాగుపై సలహాలు ఇచ్చారు. దుర్గం ఎంపీటీసీ శంకర్ నాయక్ కలిపించుకొని రైతులకు సర్వేల పేరిట ఇబ్బందులకు గురి చేస్తూ జిరాక్స్ సెంటర్లకు నడుపుతున్నారని ఆయన సభలో తెలిపారు. ప్రతీ నెలకోసారి సర్వేలు అనుకుంటూ రైతులతోని ఆడుకుంటున్నారన్నారు. మండలంలో ఆర్అండ్‌బీ రోడ్ల నాణ్యత పై వివరణ ఇవ్వాలని, ఎక్కడెక్కడ రోడ్ల సమస్యలు ఉన్నాయో చెప్పమని జేఈని అడిగితే ఆయన సరైన సమాధానం చెప్పకపోవడంతో సభలో ఆయనపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తానాజీరావు, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో సాయాగౌడ్, ఏఎంసీ చైర్మన్ గీతారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ కేంద్రాలను సమయానుసారంగా నడిపించాలి'

సదాశివనగర్ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలను సమయానుసారంగా నడిపిస్తూ చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని ఐసీడీసీఎస్ పర్యవేక్షకురాలు మాధురి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తల మాసాం తపు సమావేశం నిర్వహించి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల పుస్తకాల నిర్వహణలో జాగ్రత్తలను పాటించాలని ఆమె అంగన్‌వాడీలకు సూచించారు.



మీకు తెలుసా?
వేడి నీటికన్నా చల్లటి నీరు బరువుగా ఉంటుంది.



ఔనా!
మనుషుల్లో లాగానే..పిల్లులు, శునకాల్లోనూ ఎడమ చేతివాటం, కుడి చేతివాటం ఉంటాయి.

సూక్తి
అస్తమించిన సూర్యుడు తిరిగి ఉదయించినట్లే. పోరాడి ఓడినవాడు తిరిగి గెలుస్తాడు.

ప్రపంచం నిదురోయింది ఇలా..

తుంపరలు తుంపరలుగా వర్షం పడుతున్న వేళ.. మెత్తని పరుపుపై... నులివెచ్చని దుప్పటి కప్పుకుని పడుకుంటే... ఆ సుఖమే వేరు కదా! చరిత్రలోకి తొంగి చూస్తే.. మంచాలు ఉండవు, పరుపులు కానరావు. 'గచ్చు' కూడా కనిపించదు. కటిక నేలపైనే కంటి నిండా నిద్రపోయేవారు. ఆనాటి ఆదిమ మానవుడి నుంచి.. ఈనాటి ఆధునిక మానవుడి వరకు ఎలా నిద్రించారో ఓ సారి చూద్దామా!

ప్రారంభం

క్రీ.పూ. 10000



ఈ కాలంలో ఎక్కువ శాతం గుహల్లో నివసించేవాళ్లు. నేల పైన జంతువుల చర్మం వేసుకుని నిద్రించేవారు

క్రీ.పూ. 3600



ఈజిప్షియన్లు కర్రతో చేసిన మంచాలపై పడుకునేవారు.

క్రీ.పూ. 3400



పర్షియన్లు 'వాటర్ బెడ్స్'ను ఉపయోగించేవారు. వీటిని గొర్రె చర్మంతో తయారు చేసేవారు.

క్రీ.పూ. 27



ఈ కాలంలో ఉన్ని లేదా పక్షుల ఈకలతో రూపొందించిన విలాసవంతమైన బెడ్స్ వచ్చాయి. రోమన్లు వీటిపైనే నిద్రించేవారు.

క్రీ.శ. 1300
మొదటిసారిగా 'మాట్రస్' అనే పదం ఈ కాలంలోనే వాడారు. 'మాత్రహ్' అనే అరబిక్ పదం నుంచి 'మాట్రస్' వచ్చింది.

1500
(పునరుజ్జీవన కాలం)



యూరోపియన్లు గడ్డితో తయారుచేసిన 'ఫ్యాబ్రిక్ పరుపు'లపై కునుకు తీసేవారు.

18వ శతాబ్దం



ఇదే కాలంలో కాటన్ పరుపులు వచ్చాయి. ప్రజలు వాటిని ఉపయోగించడం అలవాటు చేసుకున్నారు. అమెరికాలో కాటన్ ఉత్పత్తి పెరిగింది ఈ సమయంలోనే.

1865



'కాయిల్ స్ప్రింగ్ మాట్రస్' ప్రజలకు అందుబాటులోకి వచ్చింది ఈ కాలంలోనే. 'సామ్యూల్ పీ కిటిల్' ఈమాట్రస్‌పై పేటెంట్ హక్కులు పొందాడు.

1879
థామస్ అల్వా ఎడిసన్ ప్రపంచానికి 'బల్బు'ను పరిచయం చేసిన సంవత్సరం. ఈ ఆవిష్కరణతో అమెరికా సగటు పౌరుని నిద్ర దాదాపు మూడు గంటలు తగ్గింది.

1950



విలాసవంతమైన పరుపులు వచ్చిన కాలం. కన్జ్యూమర్ మార్కెట్‌లోకి ఇవి విరివిగా రావడంతో అందరినీ ఆకట్టుకున్నాయి

1970
స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం తొలిసారిగా 'స్లీప్ రీసెర్చ్ సెంటర్'ను ప్రారంభించింది.

1960



మోడ్రన్ వాటర్ బెడ్స్ వాడటం మొదలైంది.

1990



నాసా 'విస్కో ఎలాస్టిక్ ఫోమ్' పరుపుల స్ఫూర్తితో, 'మెమొరీ ఫోమ్ మాట్రస్'లు రూపొందాయి.

ప్రస్తుతం

2012



ఎక్కువ లేయర్లతో సాఫ్ట్ కుషన్‌తో, ఎంతో సౌకర్యంగా ఉండే విలాసవంతమైన పరుపులు అందుబాటులోకి వచ్చాయి.

పదాలు కనుక్కోండి

L	E	A	F	Y	E	Y	P	N
Y	O	A	Y	E	K	L	E	C
C	R	U	E	K	A	D	N	R
E	A	T	L	R	R	L	W	I
I	N	U	L	U	T	O	O	S
P	G	M	O	T	F	C	R	P
C	E	N	W	R	E	D	B	W
E	L	P	P	A	P	M	A	J
B	C	H	A	N	G	E	Q	K

YELLOW PIE BROWN RAKE ORANGE	COLD CRISP AUTUMN RED	LEAF CHANGE APPLE TURKEY

చెప్పగలరా?

ఉడతలో ఉన్నా కానీ మిడతలో లేను
వాద్యంలో ఉన్నా కానీ వాదంలో లేను
మంచిలో ఉన్నా కానీ కంచిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

జవాబులు
చెప్పగలరా? : ఉద్యమం
జంతర్‌మంతర్ : 1. ఉమ్మడి 2. శ్రీకారం 3. సారూప్యం 4. మెరుపు


టంగ్ ట్విస్టర్స్

1. Excited executioner exercising his excising powers exces-sively.
2. Pail of ale aiding ailing Al's travails.
3. Double bubble gum, bubbles double.
4. Salty broccoli, salty broccoli, salty broccoli

జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి
1. మ్మఉడి ▸ ....
2. శ్రీరంకా ▸ ....
3. రూసాప్యం ▸ ....
4. రుపుమె ▸ ....

రంగులద్దండి



మేడపై మేడ.. అనుమతులు ఏడ?

●నగరంలో అడ్డగోలుగా భవన నిర్మాణాలు ●పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



'ఆంధ్రజ్యోతి' ప్రత్యేకం

(ఆంధ్రజ్యోతి - నిజామాబాద్)

నగరంలోని అక్రమ కట్టడాలపై చర్యలు ఏవి. ప్రజాప్రతినిధుల అండతో అక్రమ కట్టడాలు కడుతున్నా పట్టించుకునే వారు లేరు. కూల్చి వేసేవారు లేరు. నాలాలను అక్రమించి నిర్మాణాలు చేస్తున్నా ఆపేవారు లేరు. లేఅవుట్లకు భిన్నంగా భారీ సముదాయాలు నిర్మిస్తూ అనుమతులు లేకుండా పెంట్‌హౌజ్‌లు కడుతున్నా చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. నేతల ఒత్తిళ్లతో తమకెందుకులే అని వది లివేస్తున్నారు. భూముల ధరలు పెరగడంతో సెట్‌బ్లాక్ లేకుండా నిర్మాణాలు చేస్తున్నా కనీసం ఆపడం లేదు. చిన్న ఇళ్లపై చర్యలు చేపట్టే అధికారులు పెద్దవారి ఇళ్లవైపు మాత్రం కన్నెత్తి చూడటం లేదు. నిజామాబాద్ నగరం గడిచిన ఇరవై ఏళ్లలో భారీగా పెరిగింది. శివారు గ్రామాలకు విస్తరించింది. నగర జనాభా నాలుగు లక్షలు దాటింది. కార్పొరేషన్ స్థాయికి ఎదగడంతో భారీ భవనాలు వచ్చాయి. నిజామాబాద్ నడిబొడ్డున గజం ధరలు లక్షలకు చేరడంతో నిర్మాణాల్లో కనీస నిబంధనలు పాటించడం లేదు. రోడ్లను సైతం జాగాలు వది లిపెట్టలేదు. నగరంలోని ఖలీల్ వాడి, కుమార్‌గల్లి, గాంధీరోడ్డుతో పాటు పలువాడలలో వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. షాపింగ్ కాంప్లెక్స్‌లు, భారీ భవన సముదాయాలు, షాపులు వెలిశాయి. మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా అనుమతులు ఇవ్వడంతో వందలాది భవనాలు నిర్మాణం అయ్యాయి. మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా నిర్మాణం చేయలేదు. లేఅవుట్‌ను పట్టించుకోలేదు. నిర్మాణం కోసం ఇచ్చిన డిజైన్‌లు సైతం మార్చారు. అనుమతులు లేకుండా భవనాల నిర్మాణం చేశారు. కొన్ని వాడలలో రోడ్లు, మురికి కాలువలను సైతం అక్రమించి నిర్మాణం చేశారు. చివరకు కొన్ని చోట్ల ఫుట్‌పాత్‌లను సైతం వదలలేదు. ఏకంగా వందలాది ఇళ్ల నిర్మాణం చేశారు. నేతల ఒత్తిళ్లతో అప్పటికి అధికారులు పట్టించుకోలేదు. భవన నిర్మాణాల నుంచి ఎంతో కొంత ఆశించిన ప్రజాప్రతినిధులు, అధికారులు చూసిచూడనట్లు వ్యవహరించడంతో నిర్మాణం జరిగాయి. నగరంలో సుమారు 800లకు పైగా కట్టడాలు నిర్మించినట్లు కార్పొరేషన్ అధికారులు గుర్తించారు. వీటితో పాటు మరో వంద భవనాలకు నోటీసులు జారీ చేశారు. వీటిని డిజైన్‌కు భిన్నంగా నిర్మించినట్లు అధికారులు గుర్తించారు. ప్రభుత్వం నుంచి, జనం నుంచి ఆందోళనలు వచ్చినప్పుడు కార్పొరేసన్ అధికారులు నామమాత్రం కూల్చివేతలు చేస్తున్నారు. చిన్నవారిపై ప్రతాపం చూపిస్తున్నారు. భారీ భవనాల జోలికి వెల్లడం లేదు. నగరంలో ఈ అక్రమ భవనాల నిర్మాణంపై మున్సిపల్, రెవెన్యూ, ఈరిగేషన్ శాఖ అధికారులు సర్వే చేశారు. వీరు కొన్ని ఇళ్ల కూల్చివేతలకు వెళ్లగానే ప్రజాప్రతినిధుల నుంచి నిరసన రాగానే వదిలివేస్తున్నారు. నగరంలో వ్యాపారం జరిగే ప్రాంతాలలో కనీసం ద్విచక్ర వాహనం సైతం వెళ్లని పరిస్థితులు ఉన్నాయి. మాస్టర్ ప్లాన్‌ను నిర్లక్ష్యం చేయడం వల్ల ఈ ఇళ్లపై పెద్దగా దృష్టిపెట్టలేదు. పండుగలు, ప్రధానమైన రోజులలో ఖలీల్‌వాడి, దేవిరోడ్, గాంధీరోడ్, కుమార్‌గల్లి, వ్యాపారం నడిచే వాడలలో మనుషులు వెళ్లడమే కష్టంగా ఉంది. భవనాలు కట్టేటప్పుడే నిర్మాణం నిబంధనలకు అనుగుణంగా జరిగేటట్లు చూస్తే ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదు. కోట్ల రూపాయలు పెట్టి నిర్మించినా భవన యజమానులు ప్రస్తుతం వెనక్కు వెళ్లేందుకు సిద్ధంగా లేరు. కొన్ని భవనాలలో ప్రమాదం జరుగుతే కనీసం వాహనం తిరిగే పరిస్థితి లేదు. జిల్లా అగ్నిమాపక శాఖ అధి కారులు సుమారు 140 భవనాలకు నోటీసులు జారీ చేశారు. ఇళ్లకూల్చివేతలు జరిగినప్పుడు అధికార పార్టీ ప్రజాప్రతినిధులతో పాటు ఇతర పార్టీల నేతలు కూడా రావడంతో ఆవైపు వెళ్లేందుకు జంకుతున్నారు. కొత్త మాస్టర్‌ప్లాన్ వస్తే దానికి అనుగుణంగా చర్యలు తీసుకు నేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. రో డ్లు ఇతర మౌలిక వసతులను కొత్త మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం కూడా నగరంలో నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్లాన్‌కు అనుగుణంగా నిర్మాణాలు చేస్తే ట్రాఫిక్‌తో పాటు ఇతర సమస్యలు తలెత్తవు. వర్షాలు పడిన సమయంలో నగరంలోని పలు కాలనీలు జలమయమై అవుతున్నాయి. నాలాలు సక్రమంగా లేకపోవడం వల్ల ఇళ్లలోకి నీళ్లు వస్తున్నాయి. రోడ్లు ఇరుకుగా ఉండటం, మోరీలు సక్రమంగా లేకపోవడం వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొత్త భవనాలు నిర్మాణం అయినప్పుడే వీటిపై దృష్టిపెడితే ఈ సమస్యలు తలెత్తేవి కావు. ప్రస్తుతమైన కొత్త నిర్మాణాలపై అధికారులు దృష్టిపెడితే నిబంధనలకు అనుగుణంగా జరిగే అవకాశం ఉంది. నగరంలోని అక్రమ కట్టడాలపై దృష్టి పెట్టామని ఎస్‌పీ ఉమాదేవి తెలిపారు. ఇప్పటికే కొన్ని భవనాలకు నోటీసులు జారీ చేశామన్నారు. రెవెన్యూ, ఈరిగేషన్ అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

యాసంగి నుంచి 24 గంటల విద్యుత్

●రుద్రూరులో రూ.16.26కోట్ల వ్యయంతో ఆహారశాస్త్ర సాంకేతిక విజ్ఞాన కళాశాల ప్రారంభం

●రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

రుద్రూరు: వచ్చే యాసంగి నుంచి వ్యవసాయరంగానికి 24గంటల విద్యుత్‌ను అందజేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రుద్రూరు మండల కేంద్రంలో రూ.16.26కోట్ల వ్యయంతో నిర్మించిన ఆహారశాస్త్రసాంకేతిక విజ్ఞానకళాశాలను బుధవారం జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రికి స్థానికులు ఘనస్వాగతం పలికారు. కళాశాల పరిసరాలను మంత్రి పరిశీలించి సంతృప్తివ్యక్తం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో విద్య వ్యవసాయరంగాలను నిర్లక్ష్యం చేశారన్నారు. తెలంగాణరాష్ట్రం ఏర్పడితే అభివృద్ధి ఏవిధంగా ఉంటుందో ఈ కళాశాల ఏర్పాటుతోనే ప్రజలు గమనించాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో ఆహార శాస్త్ర సాంకేతిక విజ్ఞాన కళాశాలు దేశంలో 12మాత్రమే ఉన్నాయని రాష్ట్రం ఏర్పడిన వెంటనే తెలంగాణకు ఈ కళాశాల మంజూరుతో 13అయ్యాయని దీనిని రుద్రూరులో ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సమైఖ్య పాలనలో పదవులను అనుభవించిన నాయకులు ఫాంహౌస్‌లకే పరిమితమయ్యారని తాను అలాంటి వ్యక్తిని కాదని పని చేయలేని పరిస్థితులలో రాజకీయాల నుంచి సవినయంగా తప్పుకుంటానన్నారు. రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించేందుకు సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఆదర్శవంతమైన పాలన, అవినీతి నిర్మూలనతో రాష్ట్రంలో పేదరికం అవినీతికి అడ్డుకట్ట వేయడం జరిగిందన్నారు. పేదవారి కోసం ఎన్నో సంక్షేమపథకాలు దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో అమల వుతున్నాయన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 35అభివృద్ధి సంక్షేమ పథకాల కోసం రూ.40వేల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో 23జిల్లాల రోడ్ల అభివృద్ధికి రూ.300కోట్లు కేటాయిస్తే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఒక్కొనియోజకవర్గానికి రూ.300కోట్లు కేటాయిస్తున్నారన్నారు. భారతదేశానికి ఉన్నవన్ని వనరులు మారే దేశాలకు లేవన్నారు. కొంతమంది దొంగబాబాలు వేషధారణలో అమాయక ప్రజలను మోసం చేస్తే ప్రభుత్వాలు వారిని అరెస్టు చేస్తే కొన్ని రాష్ట్రాలలో విధ్వంసాలు, హత్యలు జరగడం విచారకమన్నారు. నేరాలు చేసేవారికి ప్రజాప్రతినిధులు మద్దతు తెలపడం శోచనీయమన్నారు. ఆహారశాస్త్రసాంకేతిక విజ్ఞాన కళాశాలలో నాలుగు సంవత్సరాల చదువు పూర్తి చేసిన తర్వాత విద్యార్థులకు మంచి భవిష్యత్ కోసం ప్రైవేటు పరిశ్రమల వారు నేరుగా రుద్రూరు కళాశాలకు వచ్చి సదస్సులు ఏర్పాటు చేసి వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తారన్నారు. నిజామాబాద్ జిల్లాలో ఇలాంటి విశాలమైన భవనం ఎక్కడ కూడా నిర్మించలేదన్నారు. విశాలమైన భవనాలు ఉన్నప్పుడే విద్యార్థులు తమ చదువుపై దృష్టి సారించగలరన్నారు. ఈ కళాశాలకు త్వరలోనే శాశ్వత ప్రతిపాదికన బోధన, బోధనేతర సిబ్బందిని నియమిస్తారని తెలిపారు. రాష్ట్రంలో నకిలీవిత్తనాలు తయారు చేసే కంపెనీలపై కేసులు నమోదు చేసి కంపెనీ యాజమానులపై పీడీయాక్టు కేసులు నమోదు చేశామన్నారు. రానున్న బతుకమ్మ పండుగకు 1



మాట్లాడుతున్న మంత్రి పోచారం

సంవత్సరాలు నిండిన ప్రతిఆడబిడ్డకు చీరలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఉభయ జిల్లాలు నిజామాబాద్, కామారెడ్డిలో 10లక్షల మంది ఆడబిడ్డలకు చీరలు పంపిణీ చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో రైతులకు 24గంటల విద్యుత్ సరఫరా ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. త్వరలోనే నిజాంసాగర్ ఆయకట్టు కిందనున్న రైతులకు కాళేశ్వరం నుంచి నిజాంసాగర్‌లోకి నీళ్లు మళ్లించి రెండుపంటలకు పుష్కలంగా నీళ్లు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్, జడ్పీ చైర్మన్ దఫేదార్‌రాజు, ఇన్‌చార్జీ కలెక్టర్ రవీందర్‌రెడ్డి, బోధన్‌సబ్‌కలెక్టర్ సికా పట్నాయక్, వైస్ ఛాన్సలర్ ప్రవీణ్‌రావు, జడ్పీటీసీలు భాస్కర్‌రెడ్డి, పుప్పాలశంకర్, ఎంపీపీలు సులోచనకిషన్, చింగ్లీబాయిభజ్యానాయక్, సర్పంచ్‌లు రామాగౌడ్, ఇందూరిచంద్రశేఖర్, ఎంపీటీసీ పట్టెపు రాములు, సొసైటీ చైర్మన్ పత్తిరాము, పత్తిలక్ష్మణ్, ఇందూరిసాయిలు, రుద్రూరు వరిచెరకు పరిశోధన అధిపతి శ్రీనివాస్, కేవీకే కృషి విజ్ఞానకేంద్రం ప్రిన్సిపాల్ పద్మవేణి త దితరులు పాల్గొన్నారు.

నవభారత నిర్మాణం కోసం ఎంపీ బీబీపాటిల్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ..

నవభారత నిర్మాణం కోసం సంకల్పంతో సిద్ధి అనే నినాదంపై జహీరాబాద్ పార్లమెంటుసభ్యులు బీబీపాటిల్ రుద్రూరు ఆహారవిజ్ఞాన సాంకేతిక కళాశాల ప్రారంభోత్సవం సమావేశంలో బుధవారం హాజరైన ప్రజాప్రతినిధులతో నవభారత నిర్మాణం సంకల్పం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022నాటికి నవభారత నిర్మాణానికి మనమందరం కలిసి సంకల్పిద్దామని ప్రతిజ్ఞ చేశారు. స్వచ్ఛభారత్‌దేశం, పేదరిక నిర్మూలన, అవినీతి భారతదేశం, తీవ్రవాద, మతోన్మాద రహిత, కులవాదరహిత భారతదేశం కోసం మనమందరం కలిసి సంకల్పిద్దామన్నారు. 2022నాటికి వ్యవసాయ ఆధారం రెండింతలు పెరిగేలా అందరు కలిసి ముందుకెళ్లాలన్నారు.

'పారిశ్రామికాభివృద్ధికి కృషి'



మాట్లాడుతున్న కవిత

ఖిల్లా: నిజామాబాద్ జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి ఆదిశగా ముందుకెళ్తున్నామని నిజామాబాద్‌పార్లమెంటు సభ్యురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. బుధవారం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరై ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఐటి రంగ అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.25 కోట్లు కెటాయిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఐటి హబ్‌ను ప్రారంభించి స్థానికులకు ఉపాధి కల్పిస్తామన్నారు. జిల్లా వ్యవసాధికారక జిల్లా అయినందున జిల్లాలో ఫుడ్‌పార్క్‌ను సైతం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని, వరంగల్‌లో టెక్స్‌టైల్, ఖమ్మంలో ఐటి ఇలా ఏ ఒక్కజిల్లా అని కాకుండా అన్ని జిల్లాలకు ప్రాముఖ్యత కల్పించి అభివృద్ధి చేస్తున్నారన్నారు. జిల్లాలో పరిశ్రమలు పెట్టె వారికి నిరంతరంగా విద్యుత్ అందించే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో పరిశ్రమలు పెట్టెవారికి అన్ని విధాల సదుపాయాలను సమకూర్చుతామని అన్నారు. పరిశ్రమలు పెట్టెవారు ప్రణాళికలు తీసుకునిముందుకొస్తే మా టీం పరుగులు పెట్టి పని చేస్తామని తెలిపారు. వాటర్‌గ్రిడ్ ద్వారా అన్ని రంగాలకు నీరు అందించనున్నట్లు చెప్పారు. జిల్లా కేంద్రం నుంచి ప్రతి పల్లెకు డబుల్ రోడ్లు వేయించడానికి రూ.12వందల కోట్లు కెటాయించామన్నారు. నగరంలో రోడ్లు అధ్వానంగా మారిన విషయం వాస్తవమేనని అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు అస్తవ్యస్థంగా చేశారన్నారు. వాటిని సరిచేయడానికి కేసీఆర్ ప్రభుత్వం అదనంగా రూ.100కోట్లు కెటాయించిందని తెలిపారు. రానున్న వేసవిలోపు అన్ని రోడ్లు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందు కోసం రూ.30కోట్ల రూపాయలను కెటాయించనున్నట్లు తెలిపారు. అదే విధంగా జిల్లాలో పసుపుబోర్డు ఏర్పాటుకు ప్రధానిని సైతం కలిసిన విషయాన్ని గుర్తు చేశారు. జిల్లాలో పతంజలి లాంటి సంస్థలను ఆహ్వానించామన్నారు. వారికి అన్ని సదుపాయాలను సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ వారి కోసం మార్కెట్ యార్డ్‌లో భవన నిర్మాణానికి స్థలాన్ని కెటాయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. స్పైయిస్ వస్తువుల ఉత్పత్తుల కోసం పరిశ్రమ పెట్టె వారి కోసం 42ఎకరాల స్థలాన్ని కెటాయించనున్నామన్నారు. రూరల్ ప్రాంతంలో విమానాశ్రమం కోసం రూ.8వందల కోట్లు కెటాయించనున్నట్లు తెలిపారు. అయితే విమానాశ్రమానికి అనుకూలంగా లేదని ప్రతినిధులు చెప్పడంతో డ్రైకోర్టు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇదే కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే బిగాలగణేష్‌గుప్త, ఎమ్మెల్సీలు రాజేశ్వర్‌రావు, వీజి.గౌడ్, మేయర్ ఆకులసుజాతలు మాట్లాడుతూ బయట నుంచి పరిశ్రమలు పెట్టెవారికి జిల్లాకు రప్పించాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ సభ్యులకు సూచించారు. ఈ సమావేశంలో చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ నూతన కార్యవర్గం సభ్యులతో ప్రమాణం చేయించారు. చాంబర్స్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులుగా శ్యాంసుదర్ అగర్‌వాల్, కార్యదర్శిగా రాజ్‌కుమార్‌సుబేదార్, ఉపాధ్యాక్షులగా వెంకట్‌నర్సాగౌడ్, కోశాధికారిగా కమల్‌కిషోర్‌ఇదాని తదితరులు పాల్గొన్నారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 3, 4

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): పైఅధికారుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. ఉన్నత పదవులు అందుకుంటారు. వృత్తి, వ్యాపారాల్లో సత్ఫలితాలు సాధిస్తారు. పెద్దల ఆరోగ్యం కొంత కలవరపెడుతుంది.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): బోధన, రవాణా రంగాల వారికి ప్రోత్సాహకరం. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. సాంకేతిక కోర్సుల్లో చేరేందుకు చేసే ప్రయత్నాలకు ఆటంకాలు ఎదురవుతాయి. కీలక సమాచారం అందుకుంటారు.

మిథునరాశి: (మే21-జూన్21): రుణప్రయత్నాలు ఫలిస్తాయి. బీమా, గ్రాట్యుటీ, పింఛన్ వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. ఇంటికి అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. కుటుంబ సభ్యుల ఆరోగ్యం కలవరపెడుతుంది.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): జనసంబంధాలు విస్తరిస్తాయి. ప్రియతములతో ప్రయాణాలు, సంభాషణలు ఉల్లాసం కలిగిస్తాయి. భాగస్వామ్యాలు లాభిస్తాయి. విలువైన డాక్యుమెంట్లు కనిపించకుండా పోయే ప్రమాదం ఉంది.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. వైద్యం, పరిశ్రమలు, సేవల రంగాల వారికి ఆర్థికంగా లాభిస్తుంది. ఉద్యోగ ప్రయత్నాలకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశాలున్నాయి.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): విద్యార్థులు లక్ష్యాలు సాధిస్తారు. ప్రేమలు ఫలిస్తాయి. సృజనాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. చిన్నారుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. చిన్నారుల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ఎంతో కాలంగా వాయిదా పడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. ఇంట్లో వేడుకలకు ఏర్పాట్లు చేస్తారు. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. కుటుంబ వ్యవహారాల కారణంగా అ శాంతికి గురవుతారు

బాన్సువాడ: పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం జూనియర్ కళాశాలలో లెక్చరర్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని బాన్సువాడ మండల ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు సయిద్‌ఖాన్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు నెలలుగా కళాశాలలో లెక్చరర్ల పోస్టులను భర్తీ చేయాలని అధికారులకు, నాయకులకు విన్నవించినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని భర్తీ చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతున్నట్లు ఆయన ఆరోపించారు. ఈ విషయమై ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసిని కలిసి ప్రస్థావించానని దీనికి ఆయన సానుకూలంగా స్పందించి సీఎం కేసీఆర్‌తో మాట్లాడి లెక్చరర్ల పోస్టును భర్తీ చేసేవిధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో డా. అబ్బాస్‌ఖాన్, అంజద్‌ఖాన్, అహ్మద్‌నవాబ్, ఇతర నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దుర్కిలో పోలీసుల పల్లెనిద్ర

బీర్కూర్: నసురుల్లాబాదు మండలం దుర్కి గ్రామంలో మంగళవారం రాత్రి నసురుల్లాబాద్ ఎస్సై గోపి, కానిస్టేబుల్లు, స్థానిక నాయకులతో కలిసి పల్లె నిద్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని చట్టవ్యతిరేఖ కార్యక్రమా లు జరగకుండా చూడాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోహన్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్యం తమ సమస్యలను పరిష్కరించాలి

● ఆర్టీసీ యూనియన్ నాయకులు ● 6వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్ష

బాన్సువాడ టౌన్: ఆర్టీసీ యాజమాన్యం తమ సమస్యలను పరిష్కరించేంత వరకు రిలే నిరాహార దీక్షలను కొనసాగిస్తామని ఆర్టీసీ యూనియన్ నాయకులు, కార్మికులు తేల్చి చెప్పారు. సమస్యల పరిష్కారం కోసం తల పెట్టిన రిలే దీక్షలు బుధవారానికి 6వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో భాగంగా శిబిరంలో ఒంటికాలిపై నిలబడి యాజమాన్యానికి వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. వీరికి సిపిఐ బాన్సువాడనియోజకర్గ ఇన్‌చార్జి దుబాస్‌రాములు పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. యాజమాన్యం దిగి వచ్చేవరకు రిలే దీక్షలు చేపడుతామని వారు హెచ్చరించారు. కార్మికుల సమస్యలు పరిష్కారం చేయకపోతే ఆమరణ నిరాహార దీక్షకు కూడా పూనుకుంటామని వారు తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

వినాయకుని మండపాల వద్ద అన్నదానం

బాన్సువాడటౌన్: పట్టణంలోని గాంధీచౌక్‌లోని ఆదర్శ యువజన గణేశ్ మండలి ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగులగామ మురళీకృష్ణ, నార్ల రఘు, బాబు, గురజాల రమేష్, రమణ, రాజు, తుకారం, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్ మండలంలో..

బీర్కూర్: మండల కేంద్రంలోని చెగువీరా గణేశ్ మండలి సభ్యులు మహాఅన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 2వేల మంది వరకు వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చెగువీరా గణేశ్ మండలి సభ్యులు శ్రీకృష్ణ,ప్రశాంత్, కీర్తిరాజ్,సాయి, అరిగె పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

బిచ్కుంద మండలంలో..

బిచ్కుంద: మండల కేంద్రంలో గణేశ్ చవితి సందర్భంగా కొలువుదీరిన 60కి పైగా వినాయకులను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు మండపాల నిర్వాహకులు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేస్తున్నారు.

ప్రతీ ఒక్కరు మరుగుదొడ్లను తప్పక నిర్మించుకోవాలి

● ఎంపీడీవో భరత్‌కుమార్

బీర్కూర్: ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయంతో ప్రతీ ఒక్కరు మరుగుదొడ్లను నిర్మించుకోవాలని ఎంపీడీవో భరత్‌కుమార్ దామరంచ ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం బీర్కూర్ మండలం దామరంచ గ్రామంలో మరుగుదొడ్ల నిర్మాణాలపై ఆయన గ్రామస్థులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామంలోని ప్రతీ ఒక్కరు తమ ఇంటి ఆవరణలో మరుగుదొడ్లను నిర్మించుకోవాలన్నారు. లేనియెడల ప్రభుత్వ పథకాలకు అనర్హులవుతారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోయిని శంకర్, ఎంపీటీసీ గంగాధర్, టీఆర్ఎస్ నాయకులు ప్రదీప్ పంతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో భరత్‌కుమార్

బీర్కూర్ గిర్దావార్‌గా మోహన్ బాధ్యతల స్వీకరణ

బీర్కూర్: మండల గిర్దావార్‌గా మోహన్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. బీర్కూర్ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ ఇటీవల పెద్దకొడప్గల్ మండలానికి బదిలీ అయ్యారు. కాగా ఆ పోస్టులోకి బీర్కూర్ ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న రాజేష్‌ను ఉన్నతాధికారులు సీనియర్ అసిస్టెంట్‌గా నియమించారు. ఇదిలా ఉండగా ఆర్ఐ పోస్టు ఖాళీ కావడంతో ఆ స్థానంలో కామారెడ్డి కలెక్టరేట్‌లో పనిచేస్తున్న మోహన్‌ను జిల్లా ఉన్నతాధికారులు గిర్దావార్‌గా నియమించారు. ఈ మేరకు మోహన్ తహసీల్దార్ కిష్టానాయక్‌ను కలిసి రిపోర్టు చేశారు.

మిషన్ భగీరథతో ప్రతీ ఇంటికి తాగునీటి కుళాయి: జడ్పీటీసీ

పిట్లం: తెలంగాణ ప్రభుత్వం ప్రతీ ఇంటికి తాగునీరు అందించేందుకు మిషన్ భగీరథ పథకం ప్రారంభించిందని జడ్పీటీసీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం పిట్లం మండలంలో కారేగాం, కారేగాం తండా, పిట్లం మండల కేంద్రంలో వాటర్ ట్యాంక్‌ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. మండలంలో 40నూతన వాటర్‌ట్యాంక్‌లను నిర్మించి డిసెంబర్ 30నాటికి తాగునీరు అందించనుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, వైస్ ఎంపీపీ నర్సాగౌడ్, ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు జగదీష్, సర్పంచ్‌లు చౌళిభాయి, గంగారం, ఏఈ రవళిక తదితరులు పాల్గొన్నారు.



ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ దృశ్యం

మద్నూర్‌లో నేడు గొర్రెల సంరక్షణపై అవగాహన

మద్నూర్: గొర్రెల కాపరులకు ప్రభుత్వం సబ్సిడీపై అందజేసిన గొర్రెలు మృత్యువాత చెందుతున్నాయని ప్రచారం కావడంతో పశుసంవర్ధకశాఖ వారు గొర్రెల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నేడు మండల కేంద్రంలో ఏర్పాటు చేశారు. గొర్రెలు సంరక్షణపై మద్నూర్ వెటర్నరీ వైద్యశాల వద్ద అవగాహన సదస్సు ఉటుందని పశువైద్యాధికారి వినీత్ తెలిపారు. గొర్రెల రవాణా సమయంలో వాటి ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని, గొర్రెల లబ్ధిదారులు అవగాహన సదస్సుకు హాజరై సంరక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఇంటర్వ్యూ

విద్యార్థులకు ప్రతీరోజు డిజిటల్ క్లాసులు



రాగిని, వార్డెన్,
కస్తుర్బా గాంధీ విద్యాలయం

ఆంధ్రజ్యోతి: ఈ సంవత్సరం కేజీబీవీలో విద్యార్థుల సంఖ్య ఎంత?

వార్డెన్: 200మంది విద్యార్థులను చేర్చుకున్నాం.

ఆంధ్రజ్యోతి: గత సంవత్సరం పదో తరగతిలో విద్యార్థులు సాధించిన ఉత్తీర్ణత శాతం ఎంత?

వార్డెన్: పదో తరగతి విద్యార్థులు పరీక్ష ఫలితాల్లో 90శాతం ఉత్తీర్ణత సాధించారు.

ఆంధ్రజ్యోతి: విద్యార్థులను విద్యావంతులుగా తీర్చి దిద్దేందుకు ఎలాంటి విద్యను బోధిస్తున్నారు ?

వార్డెన్: ప్రతీ రోజు అన్ని తరగతుల విద్యార్థులకు డిజిటల్ క్లాస్‌లు నిర్వహిస్తు మెరుగైన విద్యాబోధన అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: బాలికల సంరక్షణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

వార్డెన్: ఈ సంవత్సరం కేజీబీవీలో చదివే బాలికల సంరక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగింది.

ఆంధ్రజ్యోతి: కేజీబీవీలో విద్యార్థులకు కావాల్సిన తాగునీరు, స్నానాల గదులు, మరుగుదొడ్లు సౌకర్యాలు ఉన్నాయా ?

వార్డెన్: కేజీబీవీలో చదివే విద్యార్థులకు కావాల్సిన పూర్తి మౌలిక వసతులు కలిగి ఉన్నాయి.

ప్రమాదకర ప్రయాణం

జర దేఖో!!

- రాజుల్లా బ్రిడ్జిపై కొట్టుకుపోయిన మొరం
- అధ్వానంగా మారిన వంతెన
- భయాందోళనలో వాహనదారులు



రాజుల్లా బ్రిడ్జీ వద్ద కొట్టుకుపోయిన మొరం

బిచ్కుంద: మండలంలోని రాజుల్లా వాగుపై నిర్మించిన బ్రిడ్జికి రెండు పక్కల మొరం కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది.. రాజుల్లా గ్రామ ప్రజలు బిచ్కుందకు రావడానికి ప్రతీ వర్షాకాలంలో వాగులో ప్రవహంచే నీటిని దాటుతు రావాల్సిన పరస్థితి ఉండేది. రాజుల్లా వాగు ప్రవాహం ఎక్కువైతే గ్రామ ప్రజలు జాతీయ రహదారి మార్గం కందర్‌పల్లి మీదుగా ఎనిమిది కిలోమీటర్ల చుట్టు తిరిగి బిచ్కుందకు వచ్చేవారు. ప్రజల అవస్థలను దృష్టిలో పెట్టుకొని 2002 సంవత్సరంలో జుక్కల్ ఎమ్మెల్యేగా ఉన్న అరుణతార రాజుల్లా-బిచ్కుంద గ్రామాల మధ్య గల వాగుపై బ్రిడ్జి నిర్మించడం జరిగింది. వాగు వెడల్పుతోనే బ్రిడ్జి నిర్మాణం కావడంతో భారీగా కురిసిన వార్షాలకు వాగు పొంగి పొర్లి బ్రిడ్జిలకి రెండు వైపులా మట్టి కొట్టుకుపోవడం జరుగుతుంది. ప్రజల రాకపోకల కోసం బ్రిడ్జి ఏర్పాటైన ఫలితం లేకుండాపోతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజుల్లా గ్రామ ప్రజలతో పాటు మద్నూర్, దెగ్లూర్ ఇటు, పెద్ద ఎక్లారా, పడంపల్లి, నాగల్ గావ్, ధన్నూర్, సోమూర్ గ్రామాల వాహనాల వారికి నాలుగు కిలో మీటర్ల ప్రయాణం తగ్గుతుంది. ఎన్నో గ్రామాల ప్రజలకు వాహనదారులకు ఉపయోగపడే రాజుల్లా వాగుపై బ్రిడ్జిని రెండువైపులా ఒక్కక్క బిట్టు బ్రిడ్జి నిర్మాణాన్ని సంబందిత శాఖ అధికారులు చేపట్టే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని గేదె మృతి

పిట్లం: మండల కేంద్రంలో జాతీయ రహదారిపై సాయిబాబా ఆలయం వద్ద బుధవారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకోని గేదె మృతి చెందింది. ఈ గేదె మండల కేంద్రంలో నివసిస్తున్న గోడకాడి లాలయ్య అనే రైతుదని గుర్తించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని గేదె మృతిని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గేదె మృతితో సుమారు రూ. 60వేల నష్టం జరిగిందని వారు పేర్కొన్నారు.



రోడ్డుపై ప్రమాదంలో మృతి చెందిన గేదె

1న ప్రభుత్వ ఉద్యోగుల సామూహిక సెలవు

జుక్కల్: సీపీఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తు సెప్టెంబర్ 1, 2017న ఉద్యోగ ఉపాధ్యాయులందరూ సామూహిక సెలవు పెట్టి జిల్లా కేంద్రంలో ర్యాలీ, ధర్నా కర్యాక్రమాలు చేపట్టనున్నామని తెలంగాణ టీచర్స్ యూనియన్ (టీటీయూ) మండల అధ్యక్షుడు గోపాల్ అన్నారు. సీపీస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీటీయూ ప్రదాన కార్యదర్శి గంగోత్రి శ్రీనివాస్, మండల నాయకులు పాల్గొన్నారు.

మద్నూర్: సామూహిక సెలవు కోసం మండల రెవెన్యూ అధికారులు తహసీల్దార్ ధన్‌వాల్‌కు వినతి పత్రం సమర్పించారు. బుధవారం సాయంత్రం మండల వీఆర్వో సంఘ అధ్యక్షుడు అంజయ్య ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న సామూహిక సెలవు కావాలని వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు బాలయ్య, నర్సయ్య, కాశీరాం, గంగారం, మారుతిపటేల్, గంగాధర్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్: మండల రెవెన్యూ ఉద్యోగులు రేపు సెలవు కోరుతూ తహసీల్దార్ కిష్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజేశ్, జూనియర్ అసెస్టెంట్ ప్రియాంక, హన్మండ్లు, శ్రీనివాస్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు సెలవుపత్రం అందజేస్తున్న వీఆర్వోలు

ధన్నూర్‌లో కూలిన పాఠశాల భవనం



అకస్మాత్తుగా కూలిన శిధిలావస్థ పాఠశాల భవనం

మద్నూర్: మండలంలోని ధన్నూర్ గ్రామంలో శిథిలావస్థ పాఠశాల భవనం అకస్మాత్తుగా కూలింది. ఇటీవల కురిసిన వర్షాలకు పాఠశాల పాత భవనం లోపలికి నీరు రావడంతో కూలిపోయింది. ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. పాఠశాలను గతంలో ఇక్కడే నిర్వహించేవారు. పాఠశాలకు నూతన భవనం నిర్మించిన తరువాత ఈ పాత భవనం నుంచి కొత్త భవనంలోకి మార్చారు. పాత పాఠశాల భవనం కూల్చివేయాలని పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ అధికారులు స్పదించలేదని గ్రామస్థులు వాపోతున్నారు. శిథిలావస్థలోని ఈ భవనంలో ఎటువంటి కార్యకలాపాలు లేకపోవడంతో ప్రమాదం జరగలేదు. అధికారులు స్పందించి పూర్తిగా భవనం కూల్చివేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రూర్బన్ పథకం కింద జుక్కల్ మండలానికి

మౌలిక సదుపాయాలు : జాయింట్ కలెక్టర్ సత్తయ్య

కామారెడ్డి: కేంద్ర ప్రభుత్వం ద్వారా జిల్లాలో రూర్బన్ పథకం కింద జుక్కల్ మండలం ఎంపికైందని జిల్లా జాయింట్ కలెక్టర్ సత్తయ్య తెలిపారు. బుధవారం కామారెడ్డి కలెక్టరేట్‌లోని జనహిత సమావేశపు హాల్‌లో జుక్కల్ మండలానికి సంబంధించి వచ్చిన సర్పంచ్‌లు, ఎన్ఆర్‌జీఎస్ క్షేత్ర సహాయకులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మూడు సంవత్సరాలకు కలిపి వివిధ అభివృద్ధి శాఖల ద్వారా కన్వర్‌జన్సీ కింద రూ.150 కోట్లు ఇస్తుందని, దీనికి కేంద్ర ప్రభుత్వం రూ. 30కోట్లు కలిపి ఈ పథకం అమలుకు కృషి చేస్తుందని తెలిపారు. దీనిలో ఇప్పటికే రూ. 9కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయల కల్పన దీనిలో ముఖ్యభాగమని అన్నారు. ఈ పథకం కింద మొదటి విడత కింద స్కూల్స్, ప్రహరీల నిర్మాణాలు, మార్కెట్ యార్డుల నిర్మాణం, గోదాముల నిర్మాణం, ధాన్యం పెట్టుకునే ప్లాట్‌పామ్స్, అంగన్‌వాడీ గదుల నిర్మాణం బస్‌షెల్టర్స్ నిర్మాణం మొదలగు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం మండలంలో వందశాతం పూర్తి కావాలన్నారు. 50శాతం మరుగుదొడ్లు నిర్మాణం పూర్తిచేసిన సర్పంచ్‌లకు రూ.2వేలు ఇస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్, రేషన్‌షాప్ డీలర్, ఎన్ఆర్ఈజీఎస్, ఐకేపీ క్షేత్రస్థాయి సిబ్బందితో ఒక స్వచ్ఛగ్రూప్‌గా ఏర్పడి ఉదయం 6గంటల నుంచి 8గంటలలోగా బహిరంగంగా బహిర్భూమికి వేళ్లే వారికి అవగాహన కల్పించేవిధంగా చూడాలని ముందుగా తెలియజెప్పకుండా వెళ్లే మంచి ఫలితాలు ఉంటాయని అన్నారు. బహిరంగా మలవిసర్జన వల్ల రోగాలు, అంటు వ్యాదులు ప్రబలే అవకాశం ఉందని తెలియజెప్పాలని అన్నారు. మరుగుదొడ్డి నిర్మించుకోకపోతే బియ్యం పంపిణీ నిలుపుదాల చేస్తామని డీలర్లు చెప్పాలని అన్నారు. ఈ సమావేశంలో బాన్సువాడ ఆర్డీవో రాజేశ్వర్, పంచాయతీ రాజ్ ఈఈ తిరుపతి, ఉద్యానవన శాఖ ఏడీ శేఖర్, భిక్కనూరు ఎమ్మార్వో శంకర్‌సింగ్, భిక్కనూరు ఎంపీడీవో, జుక్కల్ మండల మార్కెట్ కమిటీ చైర్మన్ సాయాగౌడ్, జుక్కల్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎడ్ల బండిపై గణపయ్యకు శోభాయాత్ర



ఎడ్ల బండిపై వినాయకుడికి శోభాయాత్ర నిర్వహిస్తున్న యువకులు

పిట్లం: గ్రామపంచాయతీ పరిధిలో దుబ్బ తండాలో వినాయక చవితికి ఏర్పాటు చేసిన గణపయ్యను బుధవారం తండావాసులు ఎడ్ల బండిపై శోభయాత్ర నిర్వహించి నిమజ్జనం చేశారు. యువకులు నృత్యాలు చేస్తు, వీధుల గుండా ఎడ్లబండిపై గణనాథుని ఊరేగింపు నిర్వహించి కుంటలో నిమజ్జనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూల్‌సింగ్, అమ్యానాయక్, పాండ్యానాయక్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మైలారం గ్రామంలో..

బీర్కూర్: నసురుల్లాబాదు మండలం మైలారం గ్రామానికి చెందిన చిన్నారులు ఏర్పాటు చేసిన చిన్ని వినాయకుడిని బుధవారం సైకిల్‌పై పెట్టుకుని చెరువు వరకు నృత్యాలు చేస్తూ నిమజ్జనం చేశారు. అనంతరం వినాయకుని లడ్డు, సేపులకు వేలంపాట నిర్వహించారు.

లెన్స్ స్టోరీ

దారి బాగు చేయండి సారూ!



దారికి అడ్డంగా ప్రవహిస్తున్న నీరు

బిచ్కుంద మండల కేంద్రంలో ఐదో వార్డులో ప్రభుత్వ ఆసుపత్రి పోస్టుమార్టం రూం పక్కన వెళ్లే దారిలో వర్షపు నీరు ప్రవహించి మోకాలి లోతున గుంత ఏర్పడింది. దీంతో వానదారులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు దృష్టి సారించి ఆ దారిని బాగు చేయాలని ప్రజలు కోరుతన్నారు. (-బిచ్కుంద)

టార్పాలీన్ల కోసం రైతుల ఇక్కట్లు

జుక్కల్: రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న టార్పాలీన్‌లు దొరక్క రైతులు ఇక్కట్లు పడుతున్నారు. 500మంది అన్నదాతలు ఉంటే 300టార్పాలీన్‌లు వచ్చాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు ఇష్టం వచ్చిన వారికి ఫోన్ చేస్తే ఇస్తున్నారనీ రైతులు డీడీ కట్టిన వారికి ఇవ్వటంలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డీడీ కోసం బ్యాంకులో నిలబడి మూడు గంటలైన డీడీ ఇవ్వలేదని అన్నారు. అప్పటిలోగా టార్ఫాలీన్‌లు అయిపోయినట్లు అధికారులు పేర్కొన్నారు.

'మిస్ ట్రాన్స్‌క్వీన్-2017' విజేత ఎవరు?

1. 'ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2017'కి ఆతిథ్యం ఇచ్చిన నగరం?
ఎ) మాడ్రిడ్(స్పెయిన్)
బి) కౌలాలంపూర్(మలేషియా)
సి) గ్లాస్గో(బ్రిటన్) డి) రోమ్(ఇటలీ)
2. చైనా ఆటగాడు లిన్‌డాన్‌ను ఓడించి ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2017 పురుషుల సింగిల్స్ విజేతగా నిలిచింది?
ఎ) చెన్‌లాంగ్(చైనా) బి) లీ చోంగ్ వి(మలేషియా)
సి) కిదాంబి శ్రీకాంత్(ఇండియా)
డి) విక్టర్ అక్సెల్‌సన్(డెన్మార్క్)
3. పి.వి.సింధుని ఓడించి ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2017 మహిళల సింగిల్స్ విజేతగా నిలిచింది?
ఎ) సైనా నెహ్వాల్(ఇండియా)
బి) నోజోమి ఒకుహర(జపాన్)
సి) ఇంతియాన్ రచనోక్(థాయ్‌లాండ్)
డి) కరోలినా మారిన్(స్పెయిన్)
4. ప్రపంచ బాక్సింగ్ చరిత్రలోనే 50 మ్యాచ్‌లను అజేయంగా గెలిచిన ఏకైక ఆటగాడు?
ఎ) ఫ్లాయిడ్ మెవెదర్(అమెరికా)
బి) ఏకియోవ్(ఫిలిప్పీన్స్)
సి) కానర్ మెక్‌గ్రెగర్(ఐర్లాండ్)
డి) రాకీ మార్షియానో(అమెరికా)
5. ఇటీవల అమెరికాలోని టెక్సాస్, హూస్టన్ నగరాల్లో వరదలకి కారణమైన హరికేన్?
ఎ) హర్వే బి) చార్లీ సి) కోర్సన్ డి) కార్లా
6. భారత సుప్రీంకోర్టు 45వ ప్రధాన న్యాయ మూర్తిగా ఎవరు ప్రమాణస్వీకారం చేశారు?
ఎ) జస్టిస్ అబ్దుల్ నజీర్ బి) జస్టిస్ దీపక్ మిశ్రా
సి) జస్టిస్ ఉదయ్ లలిత్ డి) జస్టిస్ నారిమన్
7. ఈశాన్య రాష్ట్రాల చరిత్రలోనే తొలిసారి 100 శాతం కంప్యూటర్ అక్షరాస్యత సాధించిన 'సంగ్‌తాంగ్ తంపక్' గ్రామం ఏ రాష్ట్రంలోనిది?
ఎ) మేఘాలయ బి) అరుణాచల్‌ప్రదేశ్
సి) అసోం డి) మణిపూర్
8. తొలి ఎకో పార్కును జమ్మూకశ్మీర్ ప్రభుత్వం ఏ జిల్లాలో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది?
ఎ) కుప్వారా బి) కథువా సి) కార్గిల్ డి) రాజౌరి
9. అండర్-17 దక్షిణాసియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (SAFF) చాంపియన్‌షిప్-2017 విజేత?
ఎ) ఇండియా బి) నేపాల్
సి) ఆఫ్ఘనిస్థాన్ డి) బంగ్లాదేశ్

10. రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ ఇటీవల రచించిన పుస్తకం?
ఎ) ఫై మెమొరీస్
బి) ఐ డూ వాట్ ఐ డూ
సి) హాఫ్ లయన్ డి) ఎమర్జింగ్ ఇండియా



11. జాతీయ క్రీడా దినోత్సవం?
ఎ) ఆగస్టు 28 బి) ఆగస్టు 29
సి) సెప్టెంబరు 1 డి) ఆగస్టు 30
12. ఇటీవల మరణించిన టోని డి బ్రమ్‌కి సంబంధించి సరైనది?
ఎ) మార్షల్ ఐలాండ్స్‌కి చెందిన వ్యక్తి
బి) 2015లో రైట్ లైవ్లీ హుడ్ అవార్డు గ్రహీత
సి) పారిస్ పర్యావరణ ఒప్పందానికి మూలపురుషుడు
డి) పైవన్నీ
13. 101 ఏళ్ల వయసులో ఇటీవల మరణించిన రామనందసేన్ గుప్తా ఎవరు?
ఎ) సాహితీవేత్త బి) సినిమాటోగ్రాఫర్
సి) మాజీ హాకీ క్రీడాకారుడు డి) టీవీ వ్యాఖ్యాత
14. ఇటీవల భారత్‌లో పర్యటించిన నేపాల్ ప్రధాని?
ఎ) ఖడ్గప్రసాద్ శర్మ ఓలి బి) పుష్పకుమార్ దహల్
సి) షేర్ బహదూర్ దేవ్‌బా డి) రాంభరణ్ యాదవ్
15. ఫోర్బ్స్ పత్రిక-2017కి గాను ప్రకటించిన ఆసియాలో అత్యంత ధనవంతుల జాబితాలో తొలిస్థానం పొందింది?
ఎ) ముకేశ్ అంబానీ బి) జాక్ మా
సి) తదాషి యనాయ్
డి) అల్ వలీద్ బిన్ తలాల్
16. దేశ చరిత్రలోనే తొలిసారి నేషనల్ స్పోర్ట్స్ మ్యూజియాన్ని ఇటీవల ఏ నగరంలో స్థాపించారు?
ఎ) ముంబై బి) న్యూఢిల్లీ
సి) బెంగళూరు డి) చెన్నై
17. ఇన్ఫోసిస్ నూతన ఛైర్మన్?
ఎ) విశాల్ సిక్కా బి) సంజయ్ జంగర్
సి) నందన్ నీలేకని డి) ఇంద్రానూయి
18. 'గోప్యత పరిమితులతో కూడిన ప్రాథమిక హక్కు'గా తొమ్మిది మంది న్యాయమూర్తులున్న సుప్రీంకోర్టు ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పునిచ్చింది. ఈ ధర్మాసనంలో లేనివారు?
ఎ) జగదీష్‌సింగ్ ఖేహర్, ఎస్.ఎ.బాబ్డే, ఆర్.కె.అగర్వాల్
బి) నారిమన్, ఎ.ఎం.సప్రే, డి.వై.చంద్రచూడ్
సి) మదన్.బి.లోకూర్, ఎన్.వి.రమణ, రణబీర్‌సింగ్
డి) ఎస్.కె.కౌల్, అబ్దుల్ నజీర్, చలమేశ్వర్

జి.కె. అండ్ కరెంట్ అఫైర్స్



ఎస్.మహిపాల్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

19. ఇటీవల ఏ ఇండియన్ కోస్ట్‌గార్డ్ నౌకను విధుల నుంచి తొలగించారు?
ఎ) ఐసిజిఎస్ వరుణ బి) ఐసిజిఎస్ రాజధాని
సి) ఐసిజిఎస్ సామ్రాట్ డి) ఐసిజిఎస్ జిజాబాయి
20. దేశంలో అంతర్గత రవాణా కోసం భారతీయ ఎయిర్‌లైనర్ 'విస్తారా'తో అవగాహన ఒప్పందం కుదుర్చుకొన్న అంతర్జాతీయ ఎయిర్‌లైన్స్?
ఎ) ఖతార్ ఎయిర్‌లైన్స్(ఖతార్)
బి) కొరెండన్ డచ్ ఎయిర్‌లైన్స్(నెదర్లాండ్)
సి) బ్లూబర్డ్ ఎయిర్‌వేస్(గ్రీస్)
డి) ఎయిర్ కోర్సికా(ఫ్రాన్స్)
21. రైల్వే బోర్డు నూతన ఛైర్మన్?
ఎ) సుధా మిశ్రా బి) అతులేష్ జిందాల్
సి) స్మృతి నారాయణ్ కాకరే డి) అశ్వని లోహని
22. ఒడిశా ప్రభుత్వం అందించే 'బిజూపట్నాయక్ అవార్డు ఫర్ సైంటిఫిక్ ఎక్సలెన్స్'ని 2016కి గాను పొందింది?
ఎ) ప్రొఫెసర్ సి.ఎన్.ఆర్.రావు
బి) ప్రొఫెసర్ దిగంబర్ బెహెరా
సి) ప్రొఫెసర్ మన్నెల్లి లక్ష్మీకాంతం
డి) డాక్టర్ ఎ.మోహన్‌రావు
23. తమిళనాడు నూతన ఉపముఖ్యమంత్రి?
ఎ) టి.టి.వి.దినకరన్ బి) ఒ.పన్నీర్ సెల్వం
సి) జయరామన్ డి) ముత్తుస్వామి
24. కేంద్రీయ విద్యాలయ సంఘటన్ విద్యార్థుల కోసం ఉద్దేశించిన 'స్వస్థ్ బచ్చే స్వస్థ్ భారత్'ని కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్ ఎక్కడ ప్రారంభించాడు?
ఎ) కొచ్చి(కేరళ) బి) కాన్పూర్(ఉత్తరప్రదేశ్)
సి) పట్నా(బీహార్) డి) మజోలి(అసోం)
25. ధర్మేంద్ర కుమార్ ఏ సంస్థకు డైరెక్టర్ జనరల్‌గా ఎంపికయ్యారు?
ఎ) బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బిఎస్ఎఫ్)
బి) రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పిఎఫ్)
సి)సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్)
డి) ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్(ఐటిబిపి)
26. ఇటీవల సైన్యంలో చేరిన LR-SAM క్షిపణి ప్రత్యేకతలు?
ఎ) భారత్ - ఇజ్రాయెల్ సంయుక్త క్షిపణి
బి) ఉపరితలం నుంచి గగనతలం ప్రయోగిస్తారు
సి) 2017 ఆగస్టులో నేవీలో ప్రవేశపెట్టారు
డి) పైవన్నీ
27. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను(e-waste) పాఠశాలల నుంచి తొలగించడానికి ప్రత్యేక కార్యాచరణను ప్రకటించిన రాష్ట్రం?
ఎ) కర్ణాటక బి) కేరళ సి) మధ్యప్రదేశ్ డి) గుజరాత్
28. జన్యు పరివర్తన పంటలపై ఇటీవల సూచనలు చేసిన పార్లమెంటరీ కమిటీకి నేతృత్వం వహించింది?
ఎ) రేణుకా చౌదరి బి) శంతను కుమార్
సి) ముకుల్ ముద్గల్
డి) టి.వి.ఎస్.ఎన్ ప్రసాద్
29. లింగ సమానత్వం కోసం 'జండర్' ప్రస్తావన లేకుండా పాస్‌పోర్టులు జారీ చేయాలని నిర్ణయించిన దేశం?
ఎ) మెక్సికో బి) నెదర్లాండ్స్
సి) పోర్చుగల్ డి) కెనడా
30. భారత విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మాస్వరాజ్ తొలి 'విదేశీభవన్'ను ఏ నగరంలో ప్రారంభించారు?
ఎ) ముంబై బి) అహ్మదాబాద్
సి) చెన్నై డి) బెంగళూరు
31. ఆర్మీ నియామకాల్లో స్వలింగ సంపర్కులకు నిషేధం విధిస్తూ ఆగస్టు 25న ఉత్తర్వులు జారీ చేసిన దేశం?
ఎ) ఐర్లాండ్ బి) నైజీరియా సి) ఫ్రాన్స్ డి) అమెరికా

32. స్వలింగ సంపర్కుల కోసం తొలిసారిగా గురుగ్రాం (హర్యానా)లో నిర్వహించిన 'మిస్ ట్రాన్స్‌క్వీన్-2017' విజేత?
ఎ) నటాషా బి) తేలాయ్
సి) రవీణ డి) లటిసియా



33. ఐక్యరాజ్య సమితి ప్రపంచ పర్యాటక సంస్థ 2016 గణాంకాల ప్రకారం అతి తక్కువ పర్యాటకులు సందర్శించిన దేశం?
ఎ) ఫిజి బి) నౌరు సి) ఆఫ్ఘనిస్థాన్ డి) తువాలు
34. 2017 ఆగస్టు 31న నిర్వహించనున్న హిందూ మహాసముద్ర దేశాల సమావేశానికి ఆతిథ్యం ఇస్తున్న నగరం?
ఎ) సింగపూర్ సిటీ బి) కొలంబో
సి) బ్యాంకాక్ డి) న్యూఢిల్లీ
35. నేపాల్ - భారత్ మధ్య ఏ నదిపై వంతెన నిర్మాణానికి భారత్ ఆమోదం తెలిపింది?
ఎ) మెచి నది బి) తమూర్ నది
సి) అరుణ్ నది డి) కనకయ్ నది
36. షాంఘై కేంద్రంగా బ్రిక్స్ దేశాలు ఏర్పాటు చేసిన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ తన తొలి ప్రాంతీయ కార్యాలయాన్ని ఎక్కడ ఏర్పాటు చేసింది?
ఎ) పోర్టలెజా(బ్రెజిల్) బి) సోచి(రష్యా)
సి) హంగ్జౌ(చైనా)
డి) జొహాన్నెస్‌బర్గ్(దక్షిణాఫ్రికా)
37. 2017 ఆగస్టు 26న కేంద్రం ఏ దేశం నుంచి బంగారం, వెండి దిగుమతులను పూర్తిగా నిషేధించింది?
ఎ) జపాన్ బి) దక్షిణాఫ్రికా
సి) దక్షిణ కొరియా డి) కజకిస్థాన్
38. బెల్జియం గ్రాండ్‌ప్రి-2017 ఫార్ములావన్ విజేత?
ఎ) సెబాస్టియన్ వెటెల్ బి) లూయిస్ హామిల్టన్
సి) డేనియల్ రికార్డో డి) నికో రోజ్‌బర్గ్
39. 'జాట్'లను ఓబీసీ జాబితాలో చేర్చి ఇటీవల ప్రత్యేక రిజర్వేషన్ కల్పించిన రాష్ట్రం?
ఎ) మహారాష్ట్ర బి) మధ్యప్రదేశ్
సి) గుజరాత్ డి) రాజస్థాన్
40. 2017 అక్టోబరులో భారత్-అమెరికా సంయుక్తంగా నిర్వహించనున్న సైనిక విన్యాసాలు?
ఎ) సూర్యకిరణ్ బి) యుద్ధ అభ్యాస్
సి) ఏకువీరన్ డి) వజ్ర

సమాధానాలు

1) సి	7) డి	13) బి	20) ఎ	27) బి	34) బి
2) డి	8) డి	14) సి	21) డి	28) ఎ	35) ఎ
3) బి	9) ఎ	15) బి	22) డి	29) డి	36) డి
4) ఎ	10) బి	16) బి	23) బి	30) ఎ	37) సి
5) ఎ	11) బి	17) సి	24) సి	31) డి	38) బి
6) బి	12) డి	18) సి	25) బి	32) ఎ	39) డి
		19) ఎ	26) డి	33) డి	40) బి

JOBS ఉద్యోగాలు

ఎఎస్ఆర్‌బి

అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్(ఎఎస్ఆర్‌బి)- ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సహకారంతో **స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 3, లోయర్ డివిజన్ క్లర్క్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 173
పోస్టుల వారీ ఖాళీలు: స్టెనోగ్రాఫర్ 95, క్లర్క్ 78
అర్హత: ఇంటర్ ఉత్తీర్ణత + స్టెనోగ్రఫీ పరిజ్ఞానం + టైపింగ్ నాలెడ్జ్ ఉండాలి.
వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. స్టెనో అభ్యర్థులకు ప్రొఫెషనల్ ఎప్టిట్యూడ్ టెస్ట్ కింద నిమిషానికి 80 పదాల వేగంతో 10 నిమిషాల డిక్టేషన్ టెస్ట్ ఉంటుంది. అభ్యర్థులు ఇంగ్లీష్ మేటర్‌ను 50 నిమిషాల్లో, హిందీ మేటర్‌ను 65 నిమిషాల్లో కంప్యూటర్‌మీద ట్రాన్స్‌క్రైబ్ చేయాలి. క్లర్క్ పోస్టుకు కంప్యూటర్ మీద నిముషానికి 35 ఇంగ్లీష్ పదాలు/ 30 హిందీ పదాల టైపింగ్ వేగం ఉండాలి.
అడ్మిషన్ సర్టిఫికెట్ డౌన్‌లోడింగ్: అక్టోబరు 14
సిబిటి నిర్వహించే తేదీ: అక్టోబరు 29
దరఖాస్తు ఫీజు: రూ.200(ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ ఎక్స్ సర్వీస్‌మెన్/ మహిళలకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది)
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 25
వెబ్‌సైట్: www.asrb.org.in, www.icar.org.in

ఐఐఐటి

చిత్తూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటి)- కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
ఆఫీసర్ - ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణత + 10 నుంచి 12 ఏళ్ల అనుభవం ఉండాలి. ఎక్స్ సర్వీస్‌మన్‌కు ప్రాధాన్యం ఉంటుంది.
గర్ల్స్ & బోయ్స్ హాస్టల్ - కేర్ టేకర్స్ & సూపర్‌వైజర్స్
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణత + తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో ప్రావీణ్యం + కనీసం రెండు నుంచి మూడేళ్ల అనుభవం ఉండాలి
ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్టర్ ఫర్ గర్ల్స్
అర్హత: ఫిజికల్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ + బాలికలకు స్పోర్ట్స్ & ఫిజికల్ యాక్టివిటీస్ నిర్వహించడంలో కనీసం 5 నుంచి 7 ఏళ్ల అనుభవం ఉండాలి.
ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తును ఇమెయిల్‌కు పంపుకోవాలి
ఇమెయిల్: recruitment@iiits.in
వెబ్‌సైట్: www.iiits.ac.in

ఎన్‌టిపిసి

ఎన్‌టిపిసి లిమిటెడ్ ఆధ్వర్యంలోని రామగుండం సూపర్ థర్మల్ పవర్ స్టేషన్- **మెడికల్ కన్సల్టెంట్స్** పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
ఖాళీలు: 5
పోస్టులు: జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ 2, స్పెషలిస్ట్స్ (సర్జరీ 1, ఇఎన్‌టి 1, ఆర్థోపెడిక్స్ 1)
కాంట్రాక్ట్ వ్యవధి: ఆరు నెలలు
అర్హత - వేతనం: సంబంధిత విభాగంలో ఎండి/ ఎంఎస్ పూర్తిచేసినవారికి నెలకు రూ.75,000; ఎంబిబిఎస్ + సంబంధిత విభాగంలో పీజీ డిప్లొమా పూర్తి చేసినవారికి నెలకు రూ.63,000; ఎంబిబిఎస్ (జిడిఎంఒ) ఉత్తీర్ణులైనవారికి నెలకు రూ.53,000 చెల్లిస్తారు.
ఇంటర్వ్యూ: సెప్టెంబరు 13న
వేదిక: Dhanwantari Hospital, NTPC Ltd, Jyothinagar(PO), Railway Station: Ramagundam, Bus Station: Godavarikhani, Dt. Peddapalli
ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తును ఇమెయిల్‌కు పంపుకోవాలి.
ఇ-మెయిల్: adhocrstps@ntpc.co.in

నీలి మందును ఏ పరిశ్రమలో ఉపయోగిస్తారు?



వేముల అశోక్
సీనియర్ ఫ్యాకల్టీ

ద్రవ పదార్థాలు

1. ద్రవ ప్రియ కొల్లాయిడ్‌కు ఉదాహరణ?
ఎ) పాలు బి) బంక సి) పొగమంచు డి) రక్తం

2. జెల్ తయారీలో ఉపయోగించే సూత్రం?
ఎ) సస్పెన్షన్ బి) సినారసిస్
సి) స్టెనోసిస్ డి) అస్మోసిస్

3. కొల్లాయిడ్ సోల్ అంటే?
ఎ) నిజ ద్రావణం బి) అవలంభన ద్రావణం
సి) విజాతి సోల్ డి) సజాతి సోల్

4. పొగమంచు కొల్లాయిడ్ విధానం?
ఎ) గాలిలో విస్తరించిన ద్రావణం
బి) గాలిలో విస్తరించిన గాలి
సి) గాలిలో విస్తరించిన ఘనం
డి) ద్రావణంలో విస్తరించిన ఘనం

5. ఫొటో కెమికల్ స్మాగ్ దేని ఉత్పత్తి?
ఎ) పెరాక్సైడ్ నైట్రేట్ బి) కార్బన్ మోనాక్సైడ్
సి) కార్బన్ డై ఆక్సైడ్ డి) ఓజోన్

6. నీలి మందును ఏ పరిశ్రమలో ఉపయోగిస్తారు?
ఎ) ఆహార తయారీ
బి) సుగంధలేపన సి) రంగు తయారీలో
డి) ఫార్మాస్యూటికల్

7. వర్షం నీటి కన్నా నదీ జలాలు కఠినంగా ఎందుకుంటాయి?
ఎ) నది ఎల్లప్పుడూ ప్రవహిస్తుంది
బి) నది సోడియం క్లోరైడ్‌ను కలిగి ఉంటుంది
సి) నది కాల్షియం, మెగ్నీషియం లవణాలను కలిగి ఉంటుంది డి) పైవన్నీ

8. పేపర్ మీద వేలిముద్రలను కనగొనడానికి ఉపయోగించే ద్రవం?
ఎ) సిల్వర్ నైట్రేట్ బి) నిక్‌హైడ్రిన్
సి) యూనివర్సల్ గ్రేపౌడర్ డి) ఏదీకాదు

9. ఇంజక్షన్‌ను స్టెరిలైజేషన్ చేయడానికి ఉపయోగించే పద్ధతి?
ఎ) ఆల్కహాల్‌లో కొద్దిసేపు నిల్వ ఉంచాలి
బి) నీటిలో వేడి చేయాలి
సి) ప్రెషర్ కుక్కర్‌లో వేడి చేయాలి డి) ఏదీకాదు

10. కింది వాటిలో నీటి శుద్ధ స్థితి ఏది?
ఎ) వర్షం నీరు బి) బావి నీరు
సి) కుళాయి నీరు డి) స్వేదన జలం

11. నీటిలోని ఆక్సిజన్ ఎన్ని Mg/liter కన్నా తక్కువ ఉండరాదు?
ఎ) 4 బి) 2 సి) 5 డి) 2

12. నూనె కలిపిన కాస్టిక్ సోడా ద్రావణాన్ని వేడి చేయగా వచ్చే పదార్థాన్ని దేని తయారీలో ఉపయోగిస్తారు?
ఎ) ఇంధనం బి) ఎరువులు
సి) సబ్బులు డి) ప్లాస్టిక్

13. ప్రభుత్వం సరఫరా చేసే నీటిని సాధారణంగా శుద్ధి చేసే పద్ధతి?
ఎ) క్లోరినేషన్ బి) అంశిక స్వేదనం
సి) వడపోత డి) డికాంటేషన్

14. చక్కెర కిణ్వన ప్రక్రియలో ఏర్పడే ప్రధాన ద్రవం?
ఎ) మిథైల్ ఆల్కహాల్ బి) ఈథైల్ ఆల్కహాల్
సి) మిథేన్ డి) బ్యూటేన్

15. రాకెట్ ఇంధనాన్ని మండించడానికి ఉపయోగించే ద్రవం?
ఎ) లెడ్ పెరాక్సైడ్ బి) మెగ్నీషియం ఆక్సైడ్
సి) అమ్మోనియం పర్‌క్లోరేట్
డి) పొటాషియం క్లోరేట్

16. మంచు ముక్కలు గాలిలో కన్నా నీటిలో త్వరగా కరగడానికి కారణం?
ఎ) నీరు గాలి కన్నా ఎక్కువ బరువైనది
బి) ఉష్ణశక్తి గాలిలో కన్నా నీటిలో తక్కువ
సి) నీరు, మంచు సంఘటనం సమానం
డి) ఉష్ణశక్తి గాలిలో కన్నా నీటిలో ఎక్కువ

17. ఆర్ద్రతను కొలిచే పరికరం?
ఎ) థర్మామీటర్ బి) హైడ్రోమీటర్
సి) హైగ్రోమీటర్ డి) బారోమీటర్

18. చల్లని నీటిలో పూర్తిగా రూపాంతరం చెందనిది?
ఎ) బెంజోయికామ్లం బి) చక్కెర
సి) వంటసోడా డి) కాస్టిక్‌సోడా

19. పెట్రోల్ వల్ల కలిగే మంటలను ఆర్పేందుకు నీటిని ఉపయోగించరు ఎందుకు?
ఎ) నీటి చల్లదనం కన్నా మంటలు అధికంగా ఉంటాయి
బి) నీరు, పెట్రోల్ రసాయనికంగా చర్య జరుగుతుంది
సి) నీరు, పెట్రోల్ ఒకదానితో ఒకటి కలిసిపోయి పై పొరలోని పెట్రోల్ మండుతుంది
డి) ఏదీకాదు

20. నీరు మరిగే స్థానం?
ఎ) ఎల్లప్పుడూ 100°C
బి) వాతావరణ పీడనంపై ఆధారపడి ఉంటుంది
సి) సాపేక్ష ఆర్ద్రతపై ఆధారపడుతుంది
డి) సాంద్రతపై ఆధారపడుతుంది

21. వాతావరణం కలిగి ఉండే నీటిఆవిరి పరిమాణం కింది వాటిలో దేనిపై ఆధారపడుతుంది?
ఎ) ఉష్ణోగ్రత పెరిగితే నీటి పరిమాణం పెరుగుతూ ఉంటుంది
బి) ఉష్ణోగ్రత తగ్గితే ఆవిరి పరిమాణం తగ్గుతుంది
సి) ఉష్ణోగ్రతపై ఆధారపడదు డి) ఏదీకాదు

జనరల్ స్టడీస్ - కెమిస్ట్రీ

22. శరీరంపై మరుగుతున్న నీరు పడినప్పుడు కంటే వేడి నీటి ఆవిరి వల్ల ఎక్కువ బొబ్బలు ఎందుకు వస్తాయి?
ఎ) నీటి ఆవిరి శరీరంలోకి తొందరగా చొచ్చుకొని పోతుంది
బి) నీటి ఆవిరి అధిక ఉష్ణోగ్రతలను కలిగి ఉంటుంది
సి) నీటి ఆవిరికి వేడి నీటి కంటే శక్తి అధికం
డి) నీటి ఆవిరి అధిక పీడనాన్ని కలిగి ఉంటుంది

23. అరచేతిలో 'ఈథర్' ద్రావణం పోసినప్పుడు చల్లగా ఉండటానికి కారణం?
ఎ) ఈథర్ చల్లని ద్రావణం కనుక
బి) భాష్పీభవనం చెందుతుంది
సి) స్వేద రంధ్రాలను చేరుతుంది
డి) అరచేతిలో కందెనగా మారడం వల్ల

24. ఒక వ్యక్తి సముద్రపు నీటిలోకి ప్రవేశించగానే చల్లదనం పొందిన భావనకు గురవుతాడు. ఎందుకు?
ఎ) ఉష్ణ సంవహన ప్రవాహాలు
బి) శరీరంలో ఉష్ణ లవణాలు పేరుకుపోవడం
సి) దేహంపై నీరు భాష్పీభవనం వల్ల
డి) భూమికి, సముద్ర నీటికి మధ్య ఉష్ణోగ్రతల భేదం

25. థర్మో ఫ్లాస్క్‌లో చల్లని లేదా వేడి ద్రవాలు చాలాసేపటి వరకు అలాగే ఉండటానికి కారణం?
ఎ) థర్మో ఫ్లాస్క్‌లో రెండుగోడల నిర్మాణాలు అధమ ఉష్ణ వాహకంగా పనిచేస్తాయి
బి) ఈ రెండు గోడల నిర్మాణాలకు లోపలి భాగం సిల్వర్ పూత ఉంటుంది
సి) రెండు గోడల నిర్మాణాల మధ్య శూన్య ప్రదేశం ఉంటుంది డి) బి, సి

26. ఒక నదిలో ప్రయాణిస్తున్న నౌక సముద్రానికి చేరిన వెంటనే...
ఎ) కొద్దిగా పైకి లేస్తుంది
బి) కొద్దిగా మునుగుతుంది
సి) అదేవిధంగా కొనసాగుతుంది డి) ఏదీకాదు

27. సముద్రపు సాంద్రత దేనిలో పెరుగుతుంది?
ఎ) సముద్రపు లోతు, లవణీయత తగ్గుతూ ఉంటే
బి) సముద్రపు లోతు, లవణీయత పెరుగుతూ ఉంటే
సి) సముద్రపు లోతు పెరిగి లవణీయత తగ్గుతూ ఉంటే
డి) లవణీయత, సముద్రపు లోతు పెరుగుతూ ఉంటే

28. కింది ద్రవాల్లో ఉత్తమ ఉష్ణవాహకం ఏది?
ఎ) నీరు బి) పాదరసం సి) ఈథర్ డి) ఆల్కహాల్

29. ఘనీభవించిన సరస్సులో చేపలు జీవించి ఉండటానికి కారణం?
ఎ) చేపల రక్తం వేడిగా ఉంటుంది
బి) మంచు కింద భాగంలోని నీరు ఘనీభవనం చెందదు
సి) మంచు ఒక మంచి ఉష్ణవాహకం
డి) ఏదీకాదు

30. రెండు పాదరస బిందువులను కలపగా ఒక పెద్ద బిందువుగా మారడానికి కారణం?
ఎ) కనిష్ఠ ఘనపరిమాణం
బి) గరిష్ఠ తలతన్యత
సి) కనిష్ఠ తలతన్యత వైశాల్యం
డి) గరిష్ఠ ఘనపరిమాణం

31. ఘనీభవించిన సరస్సు పైభాగంలో -15°C ఉష్ణోగ్రత ఉంటే కింది పొరల్లో ఉండే ఉష్ణోగ్రత ఎంత?
ఎ) 0°C బి) 4°C సి) -15°C డి) -7.5°C

32. శీతల ప్రదేశాల్లో ఉపయోగించే థర్మామీటర్‌లో పాదరసం కన్నా ఆల్కహాల్ ద్రావణాన్ని తీసుకోవడానికి కారణం?
ఎ) ఆల్కహాల్ ఉత్తమ ఉష్ణవాహనం
బి) ఆల్కహాల్ ఘనీభవన స్థానం తక్కువ
సి) ఆల్కహాల్ ఘనీభవన స్థానం ఎక్కువ
డి) ఏదీకాదు

33. 97% సముద్రపు నీరు, 3% శుద్ధమైన నీరు ఉండే లవణం?
ఎ) జలావరణం బి) స్ట్రాటో ఆవరణం
సి) శిలావరణం డి) వాతావరణం

34. నీరు అనేది ఒక?
ఎ) ఒక మూలకం బి) ఒక ద్రవం
సి) ఒక మిశ్రమం డి) ఒక సంయోగ పదార్థం

35. నీటిలో ఆక్సిజన్ ఎంత శాతం ఉంటుంది?
ఎ) 86% బి) 96% సి) 21% డి) 100%

36. చెమట ఎక్కువగా పట్టేస్థితి?
ఎ) వేడి అధికంగా ఉండి, గాలిలో తేమ ఉండటం
బి) వేడి అధికంగా ఉండి గాలి పొడిగా ఉండటం
సి) వేడి తక్కువగా ఉండి గాలిలో తేమ ఉండటం
డి) వేడి తక్కువగా ఉండి గాలి పొడిగా ఉండటం

37. వార్షిక గ్లోబల్ ఇన్నోవేషన్ బారోమీటర్‌లో ఇండియా స్థానం?
ఎ) 3 బి) 4 సి) 5 డి) 6

38. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం?
ఎ) ఏప్రిల్ 7 బి) మే 7
సి) ఆగస్టు 7 డి) సెప్టెంబరు 6

39. ఇండియాలో చమురు శుద్ధి కర్మాగారాల సంఖ్య?
ఎ) 19 బి) 18 సి) 17 డి) 16

40. వాటర్ గ్యాస్ అంటే?
ఎ) కార్బన్ మోనాక్సైడ్, హైడ్రోజన్
బి) కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్
సి) అల్యూమినియం హైడ్రేట్ డి) ఏదీకాదు

41. అనిమోమీటర్ ద్వారా దేన్ని లెక్కించవచ్చు?
ఎ) సముద్ర స్థాయిపైన ఎత్తుని బి) గాలి తేమను
సి) సముద్రపు లోతు డి) గాలి వేగాన్ని

42. వెంచురీ మీటర్ ద్వారా దేన్ని లెక్కిస్తారు?
ఎ) ప్రవాహిరేటు బి) గాలివేగం
సి) సాంద్రత డి) ఆర్ద్రత

43. మేఘాలు ఏర్పడటానికి కింది వాటిలో ఏది అవసరం లేదు?
ఎ) వాతావరణంలోని దుమ్ము కణాలు
బి) నీరు ఆవిరి కావడం సి) నీరు గడ్డకట్టడం
డి) గాలి

44. ద్రవ నైట్రోజన్‌లో దీర్ఘ అపరిశుద్ధమైనది?
ఎ) ద్రవ హీలియం బి) ద్రవ ఆక్సిజన్
సి) ఘన కార్బన్ డై ఆక్సైడ్ డి) ద్రవ హైడ్రోజన్

45. వేసవి ద్రవంగా పిలిచే పదార్థం?
ఎ) పాదరసం బి) నీరు సి) గాలియం డి) రేడియం

సమాధానాలు

1) బి	8) బి	15) సి	23) బి	31) ఎ	39) ఎ
2) బి	9) ఎ	16) డి	24) సి	32) సి	40) ఎ
3) సి	10) ఎ	17) సి	25) డి	33) ఎ	41) డి
4) ఎ	11) ఎ	18) ఎ	26) ఎ	34) డి	42) ఎ
5) డి	12) సి	19) సి	27) డి	35) ఎ	43) సి
6) సి	13) ఎ	20) బి	28) బి	36) ఎ	44) డి
7) సి	14) బి	21) ఎ	29) బి	37) డి	45) సి
		22) సి	30) సి	38) ఎ	

స్కాలర్‌షిప్

నేషనల్ ఒలింపియాడ్ ప్రోగ్రామ్

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ (ఐఎపిటి), హోమి బాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్(హెచ్‌బిసిఎస్ఇ) ఉమ్మడిగా నిర్వహిస్తున్న నేషనల్ ఒలింపియాడ్ ప్రోగ్రామ్‌కు ప్రతిభావంతులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నారు.

విభాగాలు: ఆస్ట్రానమీ, బయాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్
అర్హత: నవంబరు 30 నాటికి ఇంటర్ లోపు చదువుతున్న విద్యార్థులందరూ దరఖాస్తు చేసుకోవచ్చు
వయసు: 1998 జూలై 1 నుంచి 2003 జూన్ 30 మధ్య జన్మించి ఉండాలి
విభాగం: జూనియర్ సైన్స్
అర్హత: నవంబరు 30 నాటికి పదోతరగతి లోపు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
వయసు: 2003 జనవరి 1 నుంచి 2004 డిసెంబరు 31 లోపు జన్మించి ఉండాలి.

ఈ ప్రోగ్రామ్‌లో అయిదు స్టేజ్‌లు ఉంటాయి. మొదటి స్టేజ్‌ని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ (ఐఎపిటి) నిర్వహిస్తుంది. మిగిలినవాటిని హోమి బాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ (హెచ్‌బిసిఎస్ఇ) నిర్వహిస్తుంది.

స్టేజ్ 1 - ఫస్ట్ స్టెప్ టు ఇంటర్నేషనల్ ఒలింపియాడ్స్ 2018 ఎగ్జామ్స్: నేషనల్ స్టాండర్డ్ ఎగ్జామినేషన్ ఇన్ ఆస్ట్రానమీ (ఎన్ఎస్ఇఎ), బయాలజీ (ఎన్ఎస్ఇబి), కెమిస్ట్రీ(ఎన్ఎస్ఇసి), జూనియర్ సైన్స్ (ఎన్ఎస్ఇజెఎస్), ఫిజిక్స్(ఎన్ఎస్ఇపి)
పరీక్ష తేదీలు: ఎన్ఎస్ఇజెఎస్ ఎగ్జామ్ నవంబరు 19న, మిగతావన్నీ నవంబరు 26న
ఎన్‌రోల్‌మెంట్‌నకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 15

ప్రతి సబ్జెక్టులో అర్హత పొందిన మొదటి 300 మందిని స్టేజ్ 2కు అనుమతిస్తారు.

స్టేజ్ 2 ఎగ్జామ్స్: ఇండియన్ నేషనల్ ఒలింపియాడ్స్ ఇన్ ఆస్ట్రోనమీ, బయాలజీ, కెమిస్ట్రీ, జూనియర్ సైన్స్, ఫిజిక్స్(ఐఎన్ఎఒ, ఐఎన్‌బిఒ, ఐఎన్‌సిహెచ్ఒ, ఐఎన్‌జెఎస్ఒ, ఐఎన్‌పిహెచ్ఒ)
స్టేజ్ 3: ప్రతి సబ్జెక్టులో ఓరియంటేషన్ కం సెలెక్షన్ క్యాంప్ నిర్వహిస్తారు. ఇందులో అర్హత పొందినవారిని స్టేజ్ 4 కింద ప్రి డిపార్చ్యూర్ ట్రైనింగ్‌కు పంపుతారు. తదుపరి స్టేజ్ 5 ఉంటుంది.

పూర్తి సమాచారం కోసం వెబ్‌సైట్ చూడవచ్చు
వెబ్‌సైట్: www.iapt.org.in
olympiads.hbcse.tifr.res.in

అడ్మిషన్స్

ఎన్ఐఇఎల్ఐటి

కాలికట్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ & ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్ఐఇఎల్ఐటి)- కింద పేర్కొన్న కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

- **పీజీ డిప్లొమా**

విభాగాలు: క్లవుడ్ కంప్యూటింగ్/ ఇన్ఫర్మేషన్ సిస్టం సెక్యూరిటీ
కాలవ్యవధి: 24 వారాలు
కోర్సులు ప్రారంభం: సెప్టెంబరు 18 నుంచి
విభాగం: ఇండస్ట్రియల్ ఆటోమేషన్ సిస్టం డిజైన్
కోర్సు వ్యవధి: 24 వారాలు
కోర్సు ప్రారంభం: సెప్టెంబరు 25 నుంచి

జాబ్ ఓరియంటెడ్ అడ్వాన్స్‌డ్ డిప్లొమా కోర్సులు

- **బిగ్ డేటా అనలిటిక్స్**

కోర్సు కాలవ్యవధి: 16 వారాలు
కోర్సు ప్రారంభం: సెప్టెంబరు 18 నుంచి

- **ఇన్ఫర్మేషన్ సిస్టం సెక్యూరిటీ లెవెల్ 1, ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, జావా ఎంటర్‌ప్రైజ్ ఎడిషన్**

కోర్సుల కాల వ్యవధి: 12 వారాలు
కోర్సులు ప్రారంభం: సెప్టెంబరు 11 నుంచి
వెబ్‌సైట్: http://nielit.gov.in/calicut

జలాశయాల్లో జలకళ

- శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా వచ్చి చేరుతున్న వరద నీరు
- 34టీఎంసీలకు చేరిన నీటి నిల్వలు
- నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 2వేలకుపైగా క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- నిండుకుండల్లా.. పోచారం, సింగీతం
- కౌలాస్‌లో స్వల్పంగా పెరిగిన నీటిమట్టం


ఎస్సారెస్పీలో జలకళ 1072.4 అడుగులకు చేరిన నీటిమట్టం

ప్రాజెక్టు వాచ్

(ఆంధ్రజ్యోతి - నిజామాబాద్)

ఉభయ జిల్లాలోని భారీ, మధ్య తరహా ప్రాజెక్టులు క్రమంగా జలకళను సంతరించుకుంటున్నాయి. ప్రధానంగా ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయిని ఎస్సారెస్పీకి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ఇప్పటికే నీటినిల్వలు 34 టీఎంసీలకు చేరాయి. నిజాంసాగర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగింది. 2316 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ఇక చిన్నతరహా ప్రాజెక్టు పోచారంతో పాటు సింగీతం రిజర్వాయర్ నిండుకుండల్లా మారాయి. కౌలాస్‌నాలా ప్రాజెక్టులో నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది.

● ఎస్సారెస్పీకి భారీగా వరద నీరు

ఎస్సారెస్పీలో నీటిమట్టం క్రమంగా వృద్ధి చెందుతోంది. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో గోదావరికి వరద పెరుగుతోంది. రెండు రోజులుగా 30వేల క్యూసెక్కులకు పైగా వరదనీరు ప్రతీరోజు వచ్చిచేరుతోంది. జిల్లాలో వర్షాలు చెదురుమదురుగానే ఉన్నా మహారాష్ట్రలో భారీ వర్షాలతో వరద పెరిగింది. మరో రెండు రోజుల పాటు ఈ వరద కొనసాగే అవకాశం ఉంది. ఇదే రీతిలో వరద వస్తే ప్రాజెక్టు నీటిమట్టం 40టీఎంసీలకు పైగా దాటుతుందని ప్రాజెక్టు అధికారులు అంచనా వేస్తున్నారు. ఖరీఫ్ పంటల కోసం నీటివిడుదలకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎస్సారెస్పీలోకి జూన్, జూలై నెలల్లో వరద రాలేదు. ఆగస్టు నెలలోనే రెండుసార్లు కురిసిన వర్షాలకు వరదలు వచ్చాయి. ప్రాజెక్టులో 8 టీఎంసీల నీరు ఉండగా ప్రస్తుతం 34 టీఎంసీలకు చేరింది. ఈ ఒక్క నెలలోనే సుమారు 26 టీఎంసీలకు పైగా వరదనీరు వచ్చిచేరింది. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు ఎస్సారెస్పీకి ఎగువనున్న అందూరా, బాలేగాం, విష్ణుపురి ప్రాజెక్టులు నిండాయి. వీటిపైన ఉన్న మిగతా చిన్న ప్రాజెక్టులు కూడా నిండటంతో దిగువకు వరద నీరు వచ్చిచేరుతోంది. ఔరంగాబాద్ సమీపంలోని జైక్వాడ్ ప్రాజెక్టులోకి కూడా వరద వచ్చి చేరుతోంది. ఆ ప్రాజెక్టు కూడా పూర్తిస్థాయిలో నిండితే ఎస్సారెస్పీకి వరద ఉధృతి పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు కాగా ప్రస్తుతం 1072.40 అడుగులకు చేరింది. ప్రాజెక్టులో 90 టీఎంసీల సామర్థ్యానికి గాను ప్రస్తుతం 34టీఎంసీల నీరు నిల్వ ఉంది. 30వేల క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లో వస్తోంది. ఇదే రీతిలో కొనసాగితే సెప్టెంబర్ మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

● కందకుర్తి వద్ద పెరుగుతున్న ప్రవాహం..

రెండు రోజులుగా రెంజల్ మండలం కందకుర్తి వద్ద గోదావరిలో నీటి ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. గోదావరిలోని శివాలయం చుట్టూ వరదనీరు చేరింది. మహారాష్ట్ర అధికారుల సమాచారం మేరకు వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉంది. ఎస్సారెస్పీలో వరద ప్రవాహం పెరుగుతుండటంతో ఈ ఖరీఫ్‌కు నీళ్లు ఇచ్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలోని ఇంజనీర్లు మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ప్రాజెక్టులోకి 40టీఎంసీల నీరు చేరగానే ఎల్ఎండీ ఎగువ ప్రాంతంలోకి మొదట నీటిని విడుదల చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఎల్ఎండీకి ఎగువ ప్రాంతంలో సుమారు 5.4 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. నిజామాబాద్‌లోని లక్ష్మికాలువ, నిర్మల్ జిల్లాలోని సరస్వతి కాలువతో పాటు కాకతీయ కాలువ ద్వారా జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల పరిధిలోని ఆయకట్టుకు నీళ్లు అందిస్తారు. మహారాష్ట్రలో భారీ వర్షాల నేపథ్యంలో వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉండటంతో ప్రాజెక్టు నీటిమట్టం 40 టీఎంసీలు దాటే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు తాము నీటి విడుదల కోసం సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఎస్సారెస్పీ దిగువ ప్రాంతంలో గణేష్ నిమజ్జనాల కోసం ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా బుధవారం 3వేల క్యూసెక్కుల నీటిని కాకతీయ కాలువకు విడుదల చేశారు. ఎస్సారెస్పీకి మరో మూడు రోజుల వరకు ఇదే రీతిలో వరద ప్రవాహం వచ్చే అవకాశం ఉందని ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ రామారావు తెలిపారు.

● నిజాంసాగర్‌లోకి 2316క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..

నిజాంసాగర్ : నిజాంసాగర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సింగూరు, నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి స్వల్పంగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో క్రమంగా నీటి నిల్వలు పెరుగుతున్నాయి. సింగూరులోకి 3115క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు గరిష్ట నీటి సామర్థ్యం 525.600 మీటర్లకు గాను 521.925 మీటర్లకు చేరుకుని 21.354టీఎంసీల నీరు నిల్వ ఉంది. నిజాంసాగర్ ప్రాజెక్టులోకి మంజీరా వెంట 2316క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో 1405 అడుగులకు గాను 1386.50 అడుగులతో 2.797టీఎంసీల నీరు నిల్వ ఉందని నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్వాహణ అధికారి దత్తాత్రేయ తెలిపారు.

● పొంగిపొర్లుతున్న పోచారం..

నిజాంసాగర్ ప్రాజెక్టు ఎగువన ఉన్న పోచారం ప్రాజెక్టు పొంగిపొర్లుతోంది. రెండు రోజుల క్రితమే ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1.820 టీఎంసీలకు చేరుకుంది. దీంతో వస్తున్న వరద దిగువన ఉన్న నిజాంసాగర్‌లోకి చేరుతోంది. సింగీతం రిజర్వాయర్ సైతం పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరింది.

● స్వల్పంగా పెరిగిన కౌలాస్‌నాలా నీటి మట్టం

జుక్కల్ : కౌలస్‌నాలా ప్రాజెక్టులోకి స్వల్పంగా వరద నీరు వచ్చి చేరుతుందని, దీంతో ప్రాజెక్టు నీటిమట్టం స్వల్పంగా పెరిగిందని ప్రాజెక్టు ఏఈ గజానన్ బుధవారం తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 458మీటర్లకు గాను ప్రస్తుతం 455.80 మీటర్లకు చేరినట్లు తెలిపారు. 1.237 టీఎంసీకి గాను ప్రస్తుతం 0.729 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు వివరించారు. ప్రాజెక్టులోకి 104క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు ఎగువన మహారాష్ట్ర, కర్నాటక ప్రాంతాల్లో వర్షాలు పుష్కలంగా కురిస్తే ప్రాజెక్టులో వరద నీరు ఎక్కువగా వచ్చి చేరుతుందని చెప్పారు. ప్రాజెక్టు ఆయకట్టుకు గురువారం నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు.

ఉర్రూతలూగించిన..

యువోత్సాహం

- అలరించిన హాస్యనటులు ● ఆకట్టుకున్న నృత్యాలు
- కార్యక్రమానికి భారీగా హాజరైన యువతీయువకులు



డ్యాన్స్ చేస్తున్న యువతులు

బాన్సువాడ : యువచేయూత యూత్ అసోసియేషన్ బాన్సువాడ వారి ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని శ్రీనివాస గార్డెన్‌లో నిర్వహించిన యువ ఉత్సవ్ ఉర్రూతలూగించింది. గ్రామీణ ప్రాంతాల్లోని యువతీ,యువకుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు నృత్యాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, నిర్వహించినట్లు సంస్థ చైర్మెన్ వినోద్, అధ్యక్షుడు సాకెత్‌లు తెలిపారు. ఈ ఉత్సవానికి జబర్దస్తఫేమ్ మహేష్ తో పాటు, పటాస్ షో కమేడియన్ బల్వీర్‌సింగ్, ప్రేమిక చిత్ర ప్రొడ్యూసర్ ఎస్.వీ.ఎన్.రావు, సీరియల్ ఫేమ్ వైభవ్, ల్యాక్స్‌విల్ చైర్మెన్ సుధీర్ పాల్గొని సందడి చేశారు. ఉత్సవంలో పాల్గొనేందుకు యువతీ యువకులు పోటీ పడ్డారు. కార్యక్రమానికి భారీ సంఖ్యలో హాజరయ్యారు. తెలంగాణ ప్రాంతంలోని ప్రతిభ ఉన్న యువతీ, యువకులకు అవకాశం కల్పించే దిశగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతిభ కలిగిన ప్రతిఒక్కరూ యువ చేయూత అసోసియేషన్‌ను సంప్రదించి తమ ప్రతిభను తెలియజేస్తే వెండి తెరపై మంచి అవకాశాలను కల్పించేందుకు కృషి చేస్తామనితెలిపారు . అనంతరం ఫిలీం ప్రొడ్యూసర్ , నవ్యాంధ్ర అధ్యక్షుడు ఎస్.వీ.ఎన్. రావు మాట్లాడుతూ తాను తీయబోయే సినిమాలలో బాన్సువాడ ప్రాంత యువతీ,యువకులకు అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారు. బాన్సువాడలో చాలా మంది ప్రతిభ కలిగిన వారు ఉన్నారని వారికి మంచి భవిష్యత్తు ఉందని అన్నారు. జబర్దస్త్ ఫేమ్ మహేష్ , పటాస్ షో కమేడియన్ బల్వీర్‌సింగ్ తమదైన శైలిలో డైలాగ్‌లతో నవ్వులు పూయించారు. యువతీ, యువకులు చూపిన ఆదరాభిమానాలకు వారు హ్యాట్సాఫ్ తెలిపారు. తమను చూసేందుకు ఇంత పెద్ద మొత్తంలో యువతీ, యువకులు హాజరు కావడం సంతోషంగా ఉందని తెలిపారు. ఇక్కడి గ్రామీణ ప్రాంతాల్లోని యువతీ,యువకులలో ఎంతో ప్రతిభ ఉందని, యువ చేయూత ఫౌండేషన్ వారు వారి ప్రతిభను వెలికి తీసేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని వారు ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. అనంతరం ఫౌండేషన్‌సభ్యులు వారిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో యువ చేయూత్ అసోసియేషన్ సభ్యులు శ్రావణ్‌రెడ్డి, అనిల్, ప్రసాద్, మహేష్, శంకర్, కేశవ్, వివేక్, మురళి, హన్మంతు, రాఘవ్ పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న జబర్దస్త్ ఫేమ్ మహేష్

రెవెన్యూ గ్రామానికో రైతు సమన్వయ సంఘం

సంఘాలతో భూ సమస్యలు దూరం : ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్


సమావేశంలో మాట్లాడుతున్న విప్ గోవర్ధన్

కామారెడ్డి: ప్రతీ రెవెన్యూ గ్రామానికి ఓ రైతు సమన్వయ సంఘం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ తెలిపారు. బుధవారం కామారెడ్డి రేణుకమాత కల్యాణ మండలంలో నిర్వహించిన కామారెడ్డి నియోజకవర్గ టీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల కళ్లలో కన్నీళ్లు చూడద్దనే సంకల్పంతో దేశంలో ఏ రాష్ట్రం కూఆ చేపట్టని విధంగా పథకాలు చేపడుతున్నారని తెలిపారు. ఉచిత కరెంట్‌తో పాటు సాగునీటి కోసం రైతులు ఇబ్బందులు పడకుండా ప్రాజెక్టుల నిర్మాణానికి కృషి చేస్తున్నారని అన్నారు. రైతు సమన్వయ సంఘాలతో ఇక భూ సమస్యలు దూరమవుతాయన్నారు. సెప్టెంబర్ 1 నుంచి 9లోగా ప్రతీ రెవెన్యూ గ్రామంలో 15 మందితో రైతు సమన్వయ సంఘం ఏర్పాటు చేయాలన్నారు. అందులో 1/3 మూడవ వంతు మహిళలకు ప్రాధాన్యత ఉండాలన్నారు. అన్ని కులాలకు ఇందులో ప్రాధాన్యత ఉంటుందన్నారు. అనంతరం మండల, జిల్లా స్థాయి సమన్వయ సంఘాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతీ సంఘానికి ఒక సమన్వయకర్త మాత్రమే ఉంటారన్నారు. ఈ సమితీలకు సలహాలు ఇవ్వడానికి వ్యవసాయ శాఖ నుంచి రిసోర్స్ పర్సన్లను నియమిస్తామన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు సమన్వయ సంఘాలకు రూ.500 కోట్లతో నిధిని ఏర్పాటు చేయడంతో పాటు రూ.6 వేల కోట్లు బ్యాంకుల ద్వారా రుణం అందించనున్నట్లు తెలిపారు. రైతులకు మద్దతు ధర లేనప్పుడు రైతుల నుంచి పంటను కొనుగోలు చేసి దేశ వ్యాప్తంగా ఎక్కడ ధర లభిస్తే అక్కడ అమ్మి సొమ్మును తిరిగి రైతు సమన్వయ సంఘంలో జమచేస్తారన్నారు. గతంలో వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించే సమగ్ర సర్వే ఆధారంగా రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తూ సర్వే నెంబర్ల ఆధారంగా భూముల వివరాలను ప్రక్షాళన చేసి రూపొందిస్తామన్నారు. భవిష్యత్తులో భూముల విషయంలో తగదాలు రాకుండా ఉండాలనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం సెప్టెంబర్ 15 నుంచి డిసెంబర్ 15 వరకు సమగ్ర భూ సర్వే కొనసాగిస్తున్నట్లు తెలిపారు.జిల్లాలో 85 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయన్నారు. గ్రామ రైతు సమన్వయ సంఘాలను ఏర్పాటు చేసి మండల, జిల్లా, రాష్ట్ర కమిటీలను ఏర్పాటు చేస్తారన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు, ఎంపీపీలు బాల్‌రాజవ్వ, మంగమ్మ, సుదర్శన్, జడ్పీటీసీలు మధుసూదన్ రావు, నంద రమేష్, లక్ష్మీ, మార్కెట్ కమిటీ చైర్మన్లు గట్టగోని రాజమణి, ఆత్మకమిటీ చైర్మన్ బల్వంత్‌రావు, పున్న రాజేశ్వర్‌రావు, గోపిగౌడ్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.